

నేటి దినపత్రిక

# సూర్య

www.suryaa.com

కాకినాడ జిల్లా
కోనసీమ జిల్లా
తూర్పు గోదావరి జిల్లా
అల్లూరి సీతారామరాజు జిల్లా

మంగళవారం,17 జూన్ 2025

8 పేజీలు


# నకిలీ డీజిల్ మాఫియా!

- అనేక శాఖల అధికారులు విజిలెన్స్‌తో కలిసి దాడులు
- 75 లక్షల 35 వేల విలువ గల ఆయిల్స్-వాహనాలు సీజ్
- యధేచ్ఛగా నకిలీ డీజిల్ అమ్మకాలు
- ఎస్.ఎ.ఎఫ్ పెట్రోలియంపై 6ఎ కేసు నమోదు



తనిఖీలు చేస్తున్న వివిధ శాఖల అధికారులు





**కాకినాడ రూరల్ మండలం సర్పవరం గ్రామ పంచాయితీ పరిధిలోని ఆటోనగర్‌లో ఎస్.ఎ.ఎఫ్. పెట్రోలియం కంపెనీ పేరుతో యధేచ్ఛగా బరితెగించి...విచ్చలవిడిగా...బహిరంగంగా...నకిలీ డీజిల్ దందా చేస్తున్నారు. ఎటువంటి అనుమతులు లేకుండానే రెండు వాహనాల్లో గన్‌లు అమర్చి నకిలీ డీజిల్ మొబైల్ వాహనాల ద్వారా అమ్మకాలు చేస్తూ ప్రభుత్వాదాయాన్ని దెబ్బకొడుతున్నారు. ఇండియన్ ఆయిల్ పేరుతో ఎపి 24 టిసి 3546 ట్యాంకర్ నిలిపి ఉండడంతో దానితోపాటు చెన్నై నుంచి నకిలీ ఆయిల్ తీసుకువచ్చిన మరో ట్యాంకర్‌ని సీజ్ చేశారు.**

**పెద్ద నకిలీ డీజిల్ రాకెట్‌ని చేధించారు విజిలెన్స్ అధికారులు. ఈ సంవత్సరం ఫిబ్రవరిలో సివిల్ సప్లై అధికారులు తనిఖీలు చేశారు కానీ వదిలేశారు.దీంతో మరింత రెచ్చిపోయిన నల్లబాబు అతిపెద్ద మాఫియాగా విస్తరించి నకిలీ డీజిల్ విక్రయాలు చేస్తుండడంపై జాయింట్ కలెక్టర్ రాహుల్ మీనాకి రాబడిన సమాచారంతో ఈ నెట్‌వర్క్ రాకెట్‌ని బద్దలు కొట్టారు.**

**ఉమ్మడి గోదావరి జిల్లాల సూర్య బ్యూరో :**



నకిలీ డీజిల్ అక్రమ రవాణాతో దొంగలకు కాసుల పంట పండుతోంది. ఇతర రాష్ట్రాల నుంచి నకిలీ బిల్లులతో రకరకాల క్రూడ్ ఆయిల్స్‌ని తీసుకువచ్చి వాటితో నకిలీ డీజిల్ ఆయిల్ తయారుచేసి లీటరు రూ.75లకి విక్రయిస్తూ తీవ్రంగా రెచ్చిపోతున్న మాఫియాపై విజిలెన్స్ అనేక శాఖల అధికారులు ఉక్కుపాదం మోపారు. అయితే కేవలం 6ఎ కేసుతో కథ ముగించడం వెనుక ఏమైవుంటుందో అర్థం కావాల్సి వుంది. ఇంత పెద్దయెత్తున నకిలీ డీజిల్ తీసుకువచ్చి రెండు గన్స్‌తో అమ్మకాలు చేస్తున్నా క్రిమినల్ కేసులు పెట్టకపోతే ఎలా అని పెట్రోల్ బంకు యజమానులు ప్రశ్నిస్తున్నారు. ప్రభుత్వానికి రావాల్సిన టాక్స్‌ను ఎగ్గొట్టి నకిలీ డీజిల్ అమ్మడం

- తరువాయి 2లో..

## దివ్యాంగులకు అండగా ఉంటా..ఆదుకుంటా

- మనోధైర్యం, ఆత్మ నిబ్బరం మీ గమ్యం కావాలి
- డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లాకు రూ.4 కోట్లతో ఉపకరణాలు
- రూ.86 లక్షల కృత్రిమ ఉపకరణాల పంపిణీ చేసిన మంత్రి సుభాష్






**రామచంద్రపురం,మేజర్‌న్యూస్ :** ప్రత్యేక అవసరాలు కలిగిన దివ్యాంగులకుఅండగాఉండి ఆదుకుంటా మని, మీరు మనో ధైర్యంతో, ఆత్మ నిబ్బరంతో ముందుకు సాగాలని రాష్ట్రకార్మికశాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్‌పిలుపునిచ్చారు.ఆర్టిఫిషియల్ లింబ్స్ మాన్యు ఫ్యాక్చరింగ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (అలింకో) ద్వారా ఏర్పాటుచేసిన కృత్రిమ ఉపకరణాలను మంత్రి సుభాష్ చేతుల మీదుగా సోమవారం పంపిణీ చేశారు. దివ్యాంగుల సంక్షేమం కోసం ప్రభుత్వం అందిస్తున్న సేవలను సద్వినియోగం చేసుకొని సకలాంగులు మాదిరిగా సమాజంలో ఉన్నతంగా ఎదగాలని మంత్రి సుభాష్ విభిన్న ప్రతిభావం తులైన దివ్యాంగులకు పిలుపు నిచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజకవర్గ పరిధిలో సుమారుగా రూ.86 లక్షలతో 290 మంది దివ్యాంగులకు 554 కృత్రిమ అవయవాలు పంపిణీ చేశారు. ప్రభుత్వ రంగ సంస్థ అయిన ఆలింకో

- తరువాయి 2లో..

## సర్పవరం పంచాయితీ సెక్రటరీ శ్రీనివాస్‌పై విచారణ

# కావుడా కొరడా

- సూర్య కథనంతో బయటపడిన ప్రభుత్వాదాయ దోపిడీ
- ఎల్‌టిపి శ్రీకృష్ణయ్య నిబంధనల ఉల్లంఘనపై నోటీసులు
- ఉన్నతస్థాయి విచారణతో ఎన్నో అక్రమాలు వెలుగు చూడనున్నాయా...!
- బిల్డర్ అక్రమాలపై విజిలెన్స్ డిఎల్‌పి తాతారావు నజర్










**కాకినాడ,మేజర్‌న్యూస్ :**జిల్లా కేంద్రం కాకినాడకి ఆనుకొని వున్న సర్పవరం గ్రామపంచాయితీ పరిధిలో అక్రమ నిర్మాణాలకు ఎల్‌టిపి శ్రీకృష్ణయ్య, పంచాయితీ సెక్రటరీ శ్రీనివాస్ సూత్రధారులుగా మారి దొడ్డిదారిన 1932 చ.గ. ల్యాండ్ కన్వర్షన్ చేయని, రెవిన్యూ స్కెచ్ లేని నాన్ లేఅవుట్‌లో 18 అడుగుల దారి మార్గాలలో నిబంధనలకు పాతరేసి మరీ అక్రమ గ్రూప్ ఆఫ్ విల్లాలనిర్మాణాలకు అనుమతులు జారీ చేస్తూ అందినకాడికి లక్షల్లో దండుకుంటున్నారు. దీనిపై సంచలనాత్మక కథనాలు జాతీయ పత్రిక సూర్యలో వెలువడటంతో జాయింట్ కలెక్టర్, కావుడా వైస్ ఛైర్మన్

- తరువాయి 2లో..

## నిత్య సాధన ద్వారా

# ఆరోగ్య యోగం

- ఘనంగా జరిగిన యోగాంధ్ర కార్యక్రమం
- పాల్గొన్న జిల్లా కలెక్టర్ మహేష్ కుమార్ - ఎమ్మెల్యే బండారు





**ఆత్రేయపురం,మేజర్‌న్యూస్ :** నిత్య సాధన ద్వారా ప్రతి ఒక్కరూ సంపూర్ణ ఆరోగ్యాన్ని సొంతం చేసుకోవచ్చుననీ జిల్లా కలెక్టర్ ఆర్.మహేష్ కుమార్, ఎమ్మెల్యే బండారు సత్యానందరావులు అన్నారు. సోమవారం మండల పరిధిలోని వాడపల్లి శ్రీ వెంకటేశ్వరస్వామివారి శ్రీనివాస ప్రాంగణము వద్ద రాష్ట్రస్థాయి టూరిజం డెస్టినేషన్ యోగాభ్యాసనాల కార్యక్రమాన్ని అత్యంత ఘనంగా ఆయుష్ వైద్యుల పర్యవేక్షణలో నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతి ఆసనంతో ప్రత్యేక ప్రయోజనాలు న్నాయని, ఆరోగ్యకర సమాజనిర్మాణంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలన్నారు. యోగాంధ్ర మాసోత్సవాల కార్యక్రమంలో భాగంగా జిల్లా కలెక్టర్, స్థానిక శాసనసభ్యులు అధికారులు, సిబ్బందితో కలిసి యోగాసనాలు వేశారు. దేశవారసత్వ సంపదతో అందరికీ ఆరోగ్యం ఆశయంతో ఇంత మంచి కార్యక్రమానికి మార్గనిర్దేశం చేయడం జరిగిందన్నారు. 45నిమిషాల సరళ యోగాసనాలతో బీపీ, మధుమేహం, ఒత్తిడి, హార్మోన్ల అసమతుల్యం వంటి సమస్యలకు చెక్ పెట్టొచ్చునన్నారు.

- తరువాయి 2లో..

# ఏజెన్సీ ప్రజలు సమస్యలు పరిష్కరించాలి



– గ్రీవెన్స్‌లో ఐటీడీఏ పీవో కట్టా సింహాచలం

రంపచోడవరం,మేజర్‌న్యూస్ : ఏజెన్సీ ప్రాంతంలోని గిరిజన గ్రామాలకు సంబంధించిన ప్రజల సమస్యలు వెంటనే పరిష్కరించాలని రంపచోడవరం ఐటీడీఏ ప్రాజెక్ట్ అధికారి కట్టాసింహాచలం పేర్కొన్నారు. సోమవారం స్థానిక ఐటీడీఏ కార్యాలయంలో వివిధ శాఖల అధికారులతో కలిసి ప్రజా సమస్యల పరిష్కార వేదిక (గ్రీవెన్స్) కార్యక్రమాన్ని ఐటీడీఏ ప్రాజెక్ట్ అధికారి కట్టా సింహాచలం, ఐటీడీఏ ఏపీఓ జనరల్ డి.ఎన్.వి.రమణ నిర్వహించారు. ఈసందర్భంగా ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి కట్టా సింహాచలం మాట్లాడుతూ ఈ వారం వివిధ సమస్యలపై 71 దరఖాస్తులు రావడం జరిగిందని ఆయన తెలిపారు. ప్రజల సమస్యలకు సంబంధించిన దరఖాస్తులు పూర్తిస్థాయిలో పరిశీలించి సంబంధిత శాఖల అధికారులు పరిష్కరించాలని ఆదేశించారు. రంపచోడవరం గ్రామంలోని ఎస్టి కాలనీలో పాత పద్ధతిలో ఒకటో తరగతి నుండి ఐదో తరగతి వరకు ప్రాథమిక పాఠశాల కొనసాగించాలని ముర్ల వెంకటేష్ రెడ్డి, పల్లాల భాగ్యవతి, లోత స్వర్ణ విజయ దరఖాస్తు సమర్పించారు. వై. రామవరం మండలం ధారగడ్డ పంచాయితీలోని బబ్బిలోవ గ్రామంలో సీసీ రోడ్డు ఏర్పాటు చేయాలని పల్లాల సోమిరెడ్డి, అందాల బొబ్బిలి రెడ్డి, అక్కపెల్లి కోటేంద్రం దరఖాస్తు సమర్పించారు. వై రామవరం మండలం ఎగువ ప్రాంతంలోని బొడ్డగండి గ్రామంలో కమ్యూనిటీ భవనం ఏర్పాటు చేయాలని, అదే విధంగా మంగంపాడు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలోని వైద్యాధికారులకు, సిబ్బందికి అదేవిధంగా ఉపాధ్యాయులకు నివాస గృహాలు ఏర్పాటు చేయాలని సరం కోట అబ్బాయి రెడ్డి దరఖాస్తు సమర్పించారు. రంపచోడవరం మండలం వెట్టి చిలకల గ్రామంలోని సర్వే నెంబర్ 5లో భూమి సమస్య పరిష్కరించాలని మడకం అబ్బాయి దొర దరఖాస్తు సమర్పించారు. ఈ కార్యక్రమంలో గిరిజన సంక్షేమ శాఖ డిప్యూటీ డైరెక్టర్ రుక్మాండయ్య, పశుసంవర్ధక శాఖ డిప్యూటీ డైరెక్టర్ షరీఫ్, ఏజెన్సీ డీఈవో వై.మల్లేశ్వరరావు, అడిషనల్ డిఎంహెచ్ఓ జి.శిరీష, డిఎల్‌డిఓ కె.కోటేశ్వరరావు, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లు ఐ.శ్రీనివాసరావు, రవి కుమార్, వెలుగు ఏపిడి దేగలయ్య, గాబ్రియేలు, పిఏఓ ఎల్.రాంబాబు, ఏడిఏలు సిహెచ్ కెవీ చౌదరి, కె.సావిత్రి, సబ్ కలెక్టర్ కార్యాలయం పరిపాలనా అధికారిణి యం.సావిత్రి, ఎంపీడీవో యస్.శ్రీనివాసరావు దొర, డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లు పి.వెంకటరమణ, చైతన్య, మల్లికార్జునరావు, శ్రీనివాసరావు, డిప్యూటీ సర్వే ఆఫ్ ఇన్స్పెక్టర్ లక్ష్మణ్, డిప్యూటీ తాసిల్దారులు శ్రీధర్, రవీంద్రబాబు, త్రిమూర్తులు, సూపరింటెండెంట్ బి.కిషోర్ పాల్గొన్నారు.

# దోబీ ఘాట్ నిర్మించాలని వినతి

– పాదా కార్యాలయంలో వినతిపత్రం అందించిన రజక వృత్తిదారుల సంఘం




పిఠాపురం,మేజర్‌న్యూస్ : దోబీఘాట్ నిర్మించాలని ఆంధ్రప్రదేశ్ రజక వృత్తిదారుల సంఘం మరియు సిపిఎం నాయకులు కోనేటి రాజు ఆధ్వర్యంలో పాదా కార్యాలయంలో వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ..యు.కొత్తపల్లి మండలం,మూలపేట గ్రామ పరిధిలో దాదాపు 30 రజకవృత్తి నిర్వహించుకునే కుటుంబాలు ఉన్నాయని, వీరంతా తరతరాలుగా ప్రస్తుతం హైస్కూలు నిర్మించిన, గతంలో చెరువుగా ఉన్న ప్రాంతంలో రజకవృత్తి నిర్వహించుకుంటూ జీవనం సాగించేవారన్నారు. దాదాపు 2 దశాబ్దాల క్రిందట చెరువుని పూడ్చి హైస్కూలు నిర్మాణం చేసారని, అదే చెరువుపై ఆధారపడిన రజక కుటుంబాలను, ప్రస్తుతం ఉన్న ప్రాంతంలోని ప్రభుత్వ స్థలమునందు ఒక ఎకరం భూమిని రజకవృత్తి నిర్వహణ కోసం కేటాయించి వృత్తిదారులందరినీ అక్కడకి తరలించారని తెలిపారు. సదరు ఎకరం భూమినకు ఒక వైపు రోడ్డు ఉండగా మిగిలిన మూడు వైపులా ఆక్రమణలకు గురై కుచించుకుపోతుంది. ఇదేమి న్యాయం అని ప్రశ్నించిన రజకవృత్తిదారులను, గ్రామ పెత్తందారులు, రైతులు వేధిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. సామాజికంగా బలహీనవర్గము నకు చెందినవారు కావడంతో... ఏమీ చేయలేని నిస్సహాయ స్థితిలో రజక వృత్తిదారులు ఉన్నారన్నారు. ఎకరం భూమిని సర్వే చేయించి, ఆక్రమణలుంటే తొలగించి, స్థలం పరిరక్షణ కోసం చుట్టూ ఫెన్సింగ్ ఏర్పాటు చేయాలని, దోబీఘాట్ నిర్మాణం చేసి, బట్టలు ఉతుకుకోవడానికి వీలుగా 6 ప్లాట్ఫాంలు నిర్మించి, బోరు కొట్టించి, ఉచిత విద్యుత్ కనెక్షన్ ఏర్పాటు చేసి ఇవ్వాలని, 343 జి.ఓ ప్రకారం సర్వే చేయించి, సదరు భూమికి రజక సహకార సంఘం పేరున పట్టా ఇవ్వాలని డిమాండ్ చేశారు.

# నిత్య సాధన ద్వారా ఆరోగ్య యోగం

మొదటిపేజి తరువాయి

రోజులో కొంత సమయాన్ని తప్పనిసరిగా యోగాకు కేటాయించాలనీ, యోగాంధ్రఅభ్యసన కార్యక్రమాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.లక్షలాది మందికి యోగాసనాలు నేర్పించేఉద్దేశంతో యోగాప్రోటోకాల్ సరళ యోగా సనాలఅభ్యసన కార్యక్రమాలను నిర్వహించాలని సూచించారన్నారు. మహిళలకు, చిన్నారులకు యోగా ఔన్నత్యంపై అవగాహన కల్పించాలన్నారు. యోగ ప్రక్రియల నిర్వహణ ద్వారా శారీరక శక్తి సంపూర్ణ ఆరోగ్యం సిద్ధిస్తుందన్నారు. దీర్ఘకాలిక నొప్పులను తగ్గించి, గుండె ఆరోగ్యాన్ని యోగా రక్త ప్రసరణను మెరుగు పరుస్తుందన్నారు. కొన్ని యోగాసనాలు జీర్ణవ్యవస్థను ఉత్తేజ పరిచి జీర్ణక్రియను మెరుగు పరుస్తాయన్నారు. యోగా వ్యాయామాలు.ఒత్తిడి ఆందోళన తగ్గుతాయని యోగాలోని శ్వాస వ్యాయామాలు, ధ్యానం మనస్సును శాంతపరచడానికి ఏకాగ్రతను కల్పించి ఒత్తిడిని తగ్గిస్తాయన్నారు. యోగా శారీరకమానసిక ఆరోగ్యాన్ని మెరుగుపరచడా నికి ఒక అద్భుతమైన మార్గమ న్నారు. యోగాను ప్రతి ఒక్కరూ దినచర్యలో చేర్చుకోవడం ద్వారా అనేక ప్రయోజనాలను పొందు తారన్నారు. ప్రపంచానికి భారత దేశం అందించిన గొప్ప సంపద యోగ అని క్రమం తప్పకుండా యోగా సాధన చేయడం వలన సంపూర్ణ ఆరోగ్యం, ప్రశాంత జీవన శైలిని పొందవచ్చునన్నారు. యోగాంధ్ర కార్యక్రమంలో భాగంగా ప్రధాని మోడీ చొరవతో ముఖ్యమంత్రి ఆదేశాలతో యోగాఆంధ్రామాసఉత్సవాలు నిర్వహించుకుంటున్నామ న్నారు. ప్రధాని మోడీ పిలుపు మేరకు యోగాంధ్ర 2025 కార్యక్రమంలో భాగంగా మే 21 నుంచి జూన్ 21 వరకు నెలరోజులపాటు పండుగ వాతావరణంలో జిల్లా వ్యాప్తంగా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. వయో, లింగ బేధం లేకుండా అందరూ యోగాను సాధన చేసి ఆరోగ్యాన్ని పొందాలన్నారు. జిల్లా వ్యాప్తంగా వేల మంది ట్రైనర్లతో లక్షలాది మందికి యోగా నేర్పించే విధంగా కృషి జరుగుతోందన్నారు ఆయుష్ వైద్యులు యోగాగురువు డా. రామచంద్ర, ఓం శాంతి యోగా గురువులు ప్రదర్శించి చేయిం చిన యోగాసనాలు ఎంతగానో ఆకట్టుకున్నాయన్నారు. చివరిగా జిల్లా కలెక్టర్ మహేష్ కుమార్ వాడపల్లి నందు జలవనరుల శాఖ ఆధ్వర్యంలో సైఫాన్ వంతెన నిర్మాణ పనులను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో డిఆర్ఓ రాజకుమారి, ఆర్డీవో టి శ్రీకర్, ఆలయ ఈవో చక్రధరరావు తాసిల్దార్ రాజేశ్వరరావు, ఎంపీడీవో వెంకట రామన్, ఎంఈఓ వర ప్రసాదరావు, ఆయుష్ జిల్లా వైద్యాధికారి కే.విజయ్ కుమారి, కూటమి నాయకులు ముదునూరి వెంకటరాజు, రామ్ బద్రిరాజు, కూసంపూడి రామకృష్ణంరాజు, కరటూరి నరసింహారావు, ముళ్లపూడి భాస్కరరావు, వివిధ శాఖల అధికారులు, ప్రజా ప్రతినిధులు, కూటమి నాయకులు పాల్గొన్నారు.

## నకిలీ డీజిల్ మాఫియా!

మొదటిపేజి తరువాయి

క్షమించరాని నేరం. దానిపై దృష్టి పెట్టకుండా 6ఎ కేసుతో కథ ముగించడం సరైనది కాదన్న విమర్శలు వినిపిస్తున్నాయి.

**అక్రమాలు అన్నీ ఇన్నీ కావు..** నకిలీ డీజిల్ రాకెట్‌తో ఎస్.ఎ.ఎఫ్. పెట్రోలియం కంపెనీ చేస్తున్న అక్రమాలు అన్నీ ఇన్నీ కావట. చెన్నై నుంచి రోజూ ఒక ట్యాంకర్ క్రూడ్ ఆయిల్ తీసుకువచ్చి బయోడీజిల్ పేరుతో అమ్మకాలు చేస్తూ రోజూ లక్షలాది రూపాయల వ్యాపారం చేస్తూ అతిపెద్ద రాకెట్‌గా నకిలీ డీజిల్ దందా సాగిస్తున్నారు కొందరు దొంగలు. జాయింట్ కలెక్టర్ రాహుల్ మీనాకి పూర్తి విశ్వసనీయ సమాచారం అందడంతో విజిలెన్స్‌తో కూడిన సంబంధిత అన్ని శాఖలతో మెరుపుదాడులు సోమవారం నిర్వహించారు. 35 వేల లీటర్ల నకిలీ ఆయిల్, రెండు ట్యాంకర్లు,రెండు వాహనాల్లో అక్రమంగా అమర్చిన డీజిల్ గన్స్‌తో సహా 75 లక్షల విలువ చేసేవాటిని సీజ్ చేశారు. అనేక సాంపిల్స్ తీసి ల్యాబ్‌కి పంపడం జరిగింది. దీనిపై విజిలెన్స్ డిఎస్పీ తాతారావు మాట్లాడుతూఅక్రమాలు బయటపడ్డాయని చెప్పారు. లోతుగా విచారణ కొనసాగుతుందని చెప్పారు. దాడుల్లో పౌరసరఫరాల శాఖ, తూనికలు కొలతల శాఖ, పొల్యూషన్ బోర్డు అధికారులు, ట్రాన్స్‌పోర్టు అధికారులు, పోలీసులు పాల్గొన్నారు.

## దివ్యాంగులకు అండగా ఉంటా.. ఆదుకుంటా

మొదటిపేజి తరువాయి

భారత ప్రభుత్వంలోనిసామాజిక న్యాయం, సాధికారత మంత్రిత్వ శాఖలోని దివ్యాంగుల సాధికారత సంక్షేమం కోసం పనిచే స్తుందన్నారు. కృత్రిమ అవయవాలు ఉపకరణాలు వాటి భాగాల లభ్యత, వినియోగం,సరఫరా పంపిణీని ప్రోత్సహిస్తుంద న్నారు. ముఖ్యంగా ఆర్థోపెడిక్, దృష్టిలోపం, వినికిడి లోపం, మేధోవైకల్యం గల వికలాంగుల ఆరోగ్య సంరక్షణ కొరకు పరికరాలు వ్యక్తిగత రక్షణ కిట్లు ఉచితంగా అందిస్తుందన్నారు. వికలాంగుల రక్షణ సిబ్బంది, ఆసుపత్రులు ఇతర సంక్షేమ సంస్థలకు చేయూతనంది స్తుందన్నారు పిల్లలు, మహిళలు, వృద్ధులు మరియు వికలాంగు లకుతగినశిక్షణ కార్యక్రమాలను నిర్వహిస్తుందన్నారు. గత సంవత్సరం నవంబర్ 4 వ తేదీన నియోజకవర్గ పరిధిలో ఆలింకో సంస్థ దివ్యాంగులకు వైద్య పరీక్షలు నిర్వహించి వికలాంగత్వ లోపాలను శాస్త్రీయ పరంగా గుర్తించి అర్హులైనవారికి కృత్రిమఅవయవాలు పంపిణీకి చర్యలు చేపట్టిందన్నారు. అదేవిధంగా కృత్రిమ అవయవాల పంపిణీకై డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లాకు రూ.4కోట్లు సంస్థ కేటాయించింది దని దీనిలో భాగంగా రామచంద్రపురం నియోజక వర్గానికి రూ.86 లక్షలు వెచ్చించినట్లు తెలిపారు. బ్యాటరీ ఆపరేటర్ మోటార్ సైకిల్లు 68, ట్రై సైకిళ్లు 41, వీల్ చైర్లు 62, నడక కర్రలు 30, మందికి, అత్యధిక డిజిటల్ వినికిడి యంత్రాలు బ్యాటరీలతో సహా 22 మందికి ఉచితంగా ఆయన సంస్థ తరుపున పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఆలింకో సంస్థ డిప్యూటీ జనరల్ మేనేజర్ సంజయ్ సింగ్, పిఠ రవి శంకర్, శివాసిస్ పట్నాయక్, జిల్లా పరిషత్ సీఈవో వి.వి.వి.ఎస్. లక్ష్మణరావు, కూటమి పార్టీ సీనియర్ నాయకులు వాసంశెట్టి సత్యం, జనసేన ఇన్చార్జి పోలిశెట్టి చంద్రశేఖర్, మున్సిపల్ చైర్ పర్సన్ రాదంశెట్టి శ్రీదేవి, ఎంపీపీ, ఎంపీడీవోలు పద్మజ్యోతి, రాంబాబు, శ్రీనివాస్, కూటమి పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## సర్పవరం పంచాయితీ సెక్రటరీ శ్రీనివాస్‌పై విచారణకావుడా కొరడా

మొదటిపేజి తరువాయి

రాహుల్ మీనా తీవ్రంగా పరిగణిస్తూ... జిల్లా పంచాయితీ అధికారి వరప్రసాద్‌ని పూర్తిస్థాయిలో విచారణ చేసి నివేదిక సమర్పించాలని ఆదేశిస్తూ ఉత్తర్వులు కావుడా నుంచి జారీ చేశారు. ఎన్నో అక్రమాలు నాన్‌లేఅవుట్ వ్యవహారాలు తెరవెనుక జరిగాయి. 40సెంట్ల వ్యవసాయ భూమికి ల్యాండ్ కన్వర్షన్ పన్నులు ప్రభుత్వానికి చెల్లించకుండా బిల్డర్ వ్యవహరించిన తీరు, విఆర్‌వో శ్రీనివాస్ పరిశీలన చేయకుండా, సర్వే చేసి భూమిలో ఎటువంటి పంట కాలువలు, ప్రభుత్వ భూమి లేదని ఇచ్చే రెవిన్యూ స్కెచ్ ఇవ్వకుండానే...

నేరుగా బిల్డింగ్‌లు నిర్మించేయడం తెలుస్తోంది. నిబంధనలు ఏమీ పరిశీలన చేయకుండా ప్లాన్‌లను గీసి పంచాయితీ అనుమతుల కోసం దరఖాస్తు చేయడం ఎల్‌టిపి శ్రీకృష్ణయ్య చేసిన తీవ్ర తప్పిదంగా తెలుస్తోంది. ఈ ఘటనపై కావుడా నుంచి నోటీసులు జారీచేసి వివరణ ఇవ్వాల్సిందిగా ఉత్తర్వులు జారీ చేసారు. 18 అడుగుల రోడ్డును పంచాయితీకి తీసుకొని...30 అడుగులు ఉన్నట్లుగా ప్లాన్లు మంజూరు చేసిన పంచాయితీ సెక్రటరీపై విచారణలో అవినీతితేలితే..చర్యలుతీవ్రంగాఉంటాయని ఉన్నతాధికారి తెలిపారు.

**కావుడా ఉత్తర్వులు అందాయి..** సర్పవరం పంచాయితీ సెక్రటరీ శ్రీనివాస్ అవినీతిపై, నిబంధనల ఉల్లంఘనపై ఆధారాలతో సహ ఫిర్యాదు చేసిన మాట వాస్తవమే. విచారణ చేసి వెంటనే నివేదిక ఇవ్వాలని ఉత్తర్వులు అందాయి. విచారణకు ఆదేశాలిచ్చాం...నివేదిక సమర్పిస్తాం. – వి.వరప్రసాద్, జిల్లా పంచాయితీ అధికారి.

# అర్జీలకు సంతృప్తికరమైన పరిష్కారం అందివ్వాలి





**కాకినాడ,మేజర్‌న్యూస్ :** ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమంలో అందిన అర్జీలకు సంతృప్తికరమైన పరిష్కారం అందివ్వాలని జిల్లా కలెక్టర్ షణ్మోహన్ అధికారులను ఆదేశించారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రతి సోమవారం నిర్వహిస్తున్న ప్రజా ఫిర్యాదుల పరిష్కార కార్యక్రమం (పీజీఆర్ఎస్) సోమవారం కాకినాడ కలెక్టరేట్ వివేకానంద హాలులో జరిగింది. ఈ కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ షణ్మోహన్..జిల్లా రెవెన్యూ అధికారి జె.వెంకటరావు, హౌసింగ్ పీడీ ఎన్వీవీ సత్యనారాయణ, సీపీవో పీ.త్రినాథ్, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ పెద్దిరాజు డీపీవో పీ.రవికుమార్ ఇతర అధికారులతో కలిసి హాజరై, జిల్లా నలుమూలల నుంచి వచ్చిన ప్రజల నుంచి వినతులు, అర్జీలను స్వీకరించారు.

ఈ అర్జీలను ఆయా శాఖల అధికారులకు సూచిస్తూ వాటిపై సత్వరం సమగ్రమైన, సంతృప్తికరమైన పరిష్కారాలు అందించాలని అధికారులను ఆదేశించారు. బియ్యం కార్డు మంజూరు, కార్డులోని పేర్లు మార్పులు చేర్పులు, పింఛన్లు, ఉద్యోగ ఉపాధి అవకాశాలు, ఇళ్ల స్థలాలు, భూమి వివరాలు ఆన్ లైన్లో నమోదు, రీ సర్వే, ఆక్రమణలు తొలగింపు, డ్రైన్, కాలువల్లో పూడిక తొలగింపు, పారిశుద్ధ్యం, తల్లికి వందనం ఆన్ లైన్ సమస్యలు వంటి అంశాలకు చెందిన మొత్తం 681 అర్జీలు అందాయి.

ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ షణ్మోహన్ మాట్లాడుతూ పీజీఆర్ఎస్ కార్యక్రమంలో అందిన అర్జీలను క్షుణ్ణంగా పరిశీలించి అర్జీదారునికి సంతృప్తికరమైన పరిష్కారం అందివ్వాలన్నారు. పరిష్కరించిన దరఖాస్తులను జిల్లా అధికారి ఆడిటింగ్ చేయాలని ఆయన సూచించారు. జిల్లా స్థాయి అధికారి ఆడిట్ చేసి నివేదిక పంపించిన తర్వాత వాటిని రాష్ట్రస్థాయిలో ఆడిట్ కి పంపించడం జరుగుతుందని ఆయన తెలిపారు. రీఓపెన్ అయ్యే దరఖాస్తుల పట్ల అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని జిల్లా కలెక్టర్ స్పష్టం చేశారు. ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమానికి హాజరు కాలేకపోయిన అర్జీదారులు తమ అర్జీలను మీకోసం.ఏపీ.జివోవి.ఇన్ వెబ్సైట్ నందు నమోదు చేసుకోవచ్చునని జిల్లా కలెక్టర్ తెలిపారు.అర్జీదార్లు తమ యొక్క అర్జీల నమోదు,అర్జీల ప్రస్తుత స్థితికి సంబంధించిన సమాచారం తెలుసుకోవడానికి టోల్ ఫ్రీ నెంబర్ 1100కి నేరుగా కాల్ చేయవచ్చని జిల్లా కలెక్టర్ తెలిపారు. కార్యక్రమంలో వివిధ శాఖల జిల్లా స్థాయి అధికారులు కలెక్టరేట్ విభాగాల అధిపతులు తదితరులు పాల్గొన్నారు.

# కలెక్టర్‌ను కలిసిన ఏపీడబ్ల్యూజేఎఫ్ బృందం

**– జర్నలిస్టుల పిల్లలకు 50శాతం అమలయ్యే విధంగా చూడాలి**

**– కలెక్టర్‌ను కోరిన ప్రతినిధులు**



**కాకినాడ, మేజర్‌న్యూస్ :** ఇటీవల కాకినాడ జిల్లా కలెక్టర్ షాన్మోహన్ సగిలి జర్నలిస్టుల పిల్లల చదువులకే 50 శాతం రాయితీ గల సర్క్యులర్‌ను జిల్లావ్యాప్తంగా అమలు చేయాలని జారీ చేశారు. అయితే దీనిపై కొన్ని ప్రైవేట్ కళాశాలలు, పాఠశాలలు నిరాకరించడంతో ఆంధ్రప్రదేశ్ వర్కింగ్ జర్నలిస్ట్ ఫెడరేషన్ (ఏపీడబ్ల్యూజేఎఫ్) సోమవారం కలెక్టర్ షాన్మోహన్ సగిలి ని కలిసి వాస్తవ పరిస్థితులను వివరించారు. ఈ సందర్భంగా కలెక్టర్‌ని కలిసి వినతి పత్రం అందించారు. కాకినాడ జిల్లా అధ్యక్షులు వాతడ నవీన్ రాజ్, ప్రధాన కార్యదర్శి ముమ్మిడి లక్ష్మణ్, ఉపాధ్యక్షులు గునిపే శోభన్ బాబు లు మాట్లాడుతూ ఇటీవల కలెక్టర్ షాన్మోహన్ విడుదల చేసిన జర్నలిస్ట్ పిల్లల చదువుల రాయితీకై 50 శాతం అమలు చేయాలని సర్క్యులర్ ను జారీ చేశారని కానీవాస్తవపరిస్థితులకు కొన్ని పాఠశాలలో 50 శాతం అమలు చేస్తున్నప్పటికీ కొన్ని పాఠశాలలు మాత్రం నిరాకరిస్తున్నాయనికలెక్టర్ దృష్టికి తీసుకువెళ్లా మన్నారు.సమాజ శ్రేయస్సు కోసం పనిచేస్తున్న జర్నలిస్టుల పిల్లలకు 50శాతం రాయితీ కలిగే విధంగా కలెక్టర్ కృషి చేయాలని కోరారు. కలెక్టర్ సానుకూలంగా స్పందిస్తూ జిల్లా వ్యాప్తంగా అమలయ్యే విధంగా తాను కృషి చేస్తానని హామీ ఇచ్చారు.

## "పిజిఆర్ఎస్ - మీ కోసం"లో ప్రజల నుంచి

# వచ్చిన అర్జీలను త్వరితగతిన పరిష్కరించాలి



**– 1100 కాల్ సెంటర్ నెంబర్ కు ఫిర్యాదులు అర్జీలు తెలపండి**

**– డివిజనల్ పరిపాలన అధికారిణి యం.సుజాత**

**రాజమహేంద్రవరం, మేజర్ న్యూస్ :** ప్రజా సమస్యల పరిష్కార వేదికలో వచ్చిన ప్రతి అర్జీని పరిశీలించి అర్జీదారునికి పూర్తి స్థాయి న్యాయం చెయ్యాలని ఆర్డీవో కార్యాలయ డివిజనల్ పరిపాలన అధికారిణి యం. సుజాత డివిజన్ స్థాయి అధికారులకు సూచించారు. సోమవారం స్థానిక ఆర్డీఓ కార్యాలయంలో నిర్వహించిన "పి జి ఆర్ ఎస్ – మీ కోసం" వేదికలో వచ్చిన అర్జీలను ఆర్డీఓ తరపున డివిజన్ స్థాయి అధికారులతో కలసి డివిజనల్ పరిపాలన అధికారిణి యం. సుజాత స్వీకరించారు.ఈ సందర్భంగా ఏవో సుజాత మాట్లాడుతూ 'పిజిఆర్ఎస్ – మీ కోసం' ద్వారా ప్రజల నుంచి 6 అర్జీలను స్వీకరించడం జరిగిందన్నారు. ప్రతి అర్జీని నిర్ణీత కాలవ్యవధిలో పరిష్కరించి దరఖాస్తుదానికి న్యాయం చేయాలని అధికారులకు సూచించారు. సోమవారం వచ్చిన అర్జీలలో రాజమహేంద్రవరం రూరల్, తొర్రేడు గ్రామానికి చెందిన సయ్యద్ అహ్మద్ అలీ అనే వ్యక్తి తన భూ సమస్యను పరిష్కరించి తనకు న్యాయం చేయవలసినదిగా దరఖాస్తు నందు పేర్కొన్నారు. రాజమహేంద్రవరం రూరల్ కాతేరు గ్రామానికి చెందిన బొండు సూరిబాబు అనే వ్యక్తి తన పొలంలోనికి పైనుంచి నీరు సరఫరా నిర్వేసినందున సమస్యలు పరిష్కరించవలసిందిగా కోరుతూ దరఖాస్తు చేసుకొని ఉన్నారు. కోరుకొండ మండలం ఆనందనగర్‌కు చెందిన సిద్దే అమ్ములు అనే మహిళ తమ వార్డు నందు అంగన్వాడి సెంటర్‌ను ఏర్పాటు చేయవలసినదిగా కోరుతూ దరఖాస్తు చేసుకుని ఉన్నారు. రాజమహేంద్రవరం రూరల్, వెలుగుబండ గ్రామానికి చెందిన వి.సత్య గంగాభవాని అనే రోడ్ల అభివృద్ధికి ఖర్చు చేసిన తాలుకు బిల్లులు చెల్లింపు చేయవలసినదిగా దరఖాస్తు చేసుకొన్నారు. రాజానగరం మండలం రాజానగరం గ్రామానికి చెందిన ఆర్.ప్రసాద్ అనే వ్యక్తి తాను నిర్మించుకుంటున్న నూతన గృహానికి అనుమతులు మంజూరు చేయవలసినదిగా దరఖాస్తు చేసుకొన్నారు. ఈ కార్యక్రమంలో డివిజన్ స్థాయి అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# తాజా కూరగాయలతో మంచి ఆరోగ్యకరమైన జీవనం- డా. అడ్డాల



**కాకినాడ, మేజర్ న్యూస్ :** స్థానిక రమణయ్యపేట వద్ద ఉన్న సాత్వా దంత వైద్యశాలలో కాకినాడ ఐడిఎ సభ్యుల ఆధ్వర్యాన జాతీయ కూరగాయల దినోత్సవం సంధర్భంగా మహిళలకు అవగాహన సదస్సు నిర్వహించారు. కాకినాడ ఐడిఎ కార్యదర్శి డా అడ్డాల మాట్లాడుతూ జూన్ 17న జాతీయ కూరగాయల దినోత్సవం జరుపుకుంటారని, కూరగాయలు ఆరోగ్యకరమైన జీవనశైలిలో ముఖ్యమైన భాగం అని, మన మొత్తం ఆరోగ్యానికి అవసరమైన పోషకాలను కలిగి ఉంటాయని ఆరోగ్యకరమైన ఆహారంలో ప్రతిరోజూ తాజా పండ్లు మరియు కూరగాయలను తినడం వలన ఎముకల నష్టాన్ని తగ్గించడంలో మరియు కొన్ని క్యాన్సర్ల నుండి రక్షించడంలో కూడా సహాయపడతాయని, అలాగే మూత్రపిండాల్లోరాళ్లు ఏర్పడకుండా నిరోధించడంలో సహాయపడుతుందని,వీటిల్లో అధికంగా ఉండే యాంటీఆక్సిడెంట్ల కారణంగా దీర్ఘకాలిక రోగాలు దరిచేరవని, కెలోరీలు కూడా తక్కువగా ఉండటంతో బరువు తగ్గాలనుకునే వారికి ఇవి అత్యంత అనుకూలమైనవని, ఇక పచ్చికూరగాయల్లో ఉండే ఎంజైమ్‌ల కారణంగా జీర్ణక్రియ మరింత సమర్థవంతంగా జరిగి ఆహారం పూర్తిగా జీర్ణమవుతుందని,వీటిల్లో అధికంగా ఉండే పీచు పదార్థంతో పేగుల్లో ఆహారం కదలికలు సులువుగా మారి, మలబద్ధకం నుంచి విముక్తి లభిస్తుందని, వీటితో రోగ నిరోధక శక్తి బలోపేతమవుతుందని, అలాగే బీపీ, షుగర్, ఊబకాయం వంటి రుగ్మతలు తగ్గుతాయని అన్నారు. ప్రతీ రోజు కూరగాయలు తినడం మరియు వాటితో వంటకాలు తయారుచేయడం ద్వారా ఆరోగ్యకరమైన జీవితాన్ని గడపవచ్చని అన్నారు. ఈ కార్యక్రమంలో డా. శ్రీవల్లి, డా. లిఖిత, డా. చైతన్య, మహిళలు పాల్గొన్నారు.

# విద్య ద్వారానే పెను మార్పులు

**– సీబీఐ మాజీ జేడీ లక్ష్మీనారాయణ**



**కాకినాడ, మేజర్ న్యూస్ :** విజ్ఞానంతో కూడిన విద్యను అభ్యసించడం ద్వారానే దేశంలో పెను విప్లవాత్మక మార్పులు వస్తాయని సిబిఐ విశ్రాంత జేడీ వి.వి.లక్ష్మీనారాయణ అన్నారు. విలువలతో కూడిన విద్యుత్ అభ్యసించడం ద్వారా వారు దేశాభివృద్ధితో పాటుగా దేశ నిర్మాణానికి కూడా ఎంతో ఉపయోగపడతారని చెప్పారు. అందుకే బలమైన పునాదితో కూడిన విద్య చాలా అవసరమని జేడీ చెప్పారు. సోమవారం కాకినాడ గాంధీ నగర్లో ఉన్న భారతీయ విద్యా భవన్‌కు చెందిన బాలవాటిక అనే కేంద్ర పాఠ్యాంశంతో కూడిన పాఠశాలను జేడీ ప్రారంభించారు.ఈ సందర్భంగా లక్ష్మీనారాయణ మాట్లాడుతూ విద్యతోనే సమాజంలోనూ ఎంతో మార్పు వస్తుందన్నారు. భారతీయ విద్యా భవన్ దేశ విదేశాల్లో ఎంతోమందికి ఉన్నతమైన విద్యను అందించి వారిలో వృత్తి శిక్షణ, నైపుణ్యాభివృద్ధిని పెంచి దేశ నిర్మాణానికి ఎంతో విలువైన కూడిన విద్యను విద్యార్థులకు అందిస్తోందన్నారు. ఈ పాఠశాలలో విజ్ఞానంతో పాటుగా కళలు, పరిజ్ఞానం వంటి పునాది నుంచే నేర్పుతారని జేడీ చెప్పారు. ఎంతో అనుభవం ఉన్న వారంతా మంచి విద్యను అందించాలని లక్ష్యంతో భారతీయ విద్యా భవన్ బాల ఆధ్వర్యంలో బాల వాటిక (ప్రీస్కూల్) ప్రారంభించి మంచి కార్యక్రమానికి శ్రీకారం చుట్టారన్నారు. ఈ పాఠశాలలో విద్యను అభ్యసించే వారికి ఉన్నత విలువలతో చదువు చెప్పి వారిని ఉన్నత స్థితికి తీసుకెళ్లడమే లక్ష్యంగా తామంతా పనిచేస్తామని ఆశ్రమ పాఠశాల మాజీ చైర్మన్ డివి కృష్ణంరాజు తెలిపారు.ఈ సమావేశంలో పి.రఘుపతి రాజు, యు.విశ్వనాథరాజు, పెద్దాపురం మున్సిపల్ మాజీ చైర్మన్ రాజా సూరిబాబు రాజు తదితరులు పాల్గొన్నారు.

# కాకినాడ కలెక్టరేట్ వద్ద భవన నిర్మాణ కార్మికుల ధర్నా



- అన్ని కార్మిక సంఘాలకు ప్రాతినిధ్యం కల్పిస్తూ భవన నిర్మాణ బోర్డును పటిష్ట పరచాలి
- పెండింగ్‌లో ఉన్న అన్ని క్లైమ్‌లను వెంటనే విడుదల చేయాలి
- సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం గత ప్రభుత్వాలు వాడుకున్న బోర్డు నిధులను బోర్డుకు జమ చేయాలి
- నిలిపివేసిన అన్ని సంక్షేమ పథకాలను తిరిగి అమలు చేయాలి
- భవన నిర్మాణ కార్మిక సంఘాల డిమాండ్

**కాకినాడ, మేజర్‌న్యూస్ :** ఈ ధర్నాను ఉద్దేశించి యూనియన్ అధ్యక్షులు జే.వెంకటేశ్వర్లు మాట్లాడుతూ కార్మికుల సంక్షేమం కోసం ఖర్చు పెట్టాల్సిన బోర్డు నిధులను ప్రభుత్వాలు తమ అవసరాలకు వాడుకోవడం దారుణం అన్నారు. బోర్డు నిధుల్లో కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ఒక్క రూపాయి కూడా జమ చేయలేదని, కార్మికుల సంక్షేమం కోసం వసూలు చేసిన సెస్ డబ్బులే బోర్డులో ఉన్నాయని, ఆ నిధులు కార్మికుల సంక్షేమం కోసమే ఖర్చు పెట్టాలని, బోర్డు నిధులు వాడుకున్న ప్రభుత్వాలు బోర్డుకి జమ చేయాలని సుప్రీంకోర్టు తీర్పు ఇచ్చినప్పటికీ లెక్కచేయకుండా కోర్టు దిక్కారాలకు పాల్పడుతున్నారని విమర్శించారు. 2024 ఎన్నికల్లో కూటమి నేతలు చంద్రబాబు, లోకేష్, పవన్ కళ్యాణ్ లు భవన నిర్మాణ బోర్డును పటిష్ట పరుస్తామని, క్లైమ్స్‌న్నీ మంజూరు చేస్తామని, సంక్షేమ పథకాలు కొనసాగిస్తామని, భవన నిర్మాణ రంగాన్ని పరుగులు పెట్టిస్తామని, అందరికీ ఉచిత ఇసుకను అందిస్తామని హామీలు ఇచ్చి సంవత్సరం దాటుతున్నప్పటికీ ఎటువంటి చర్యలు తీసుకోలేదని విమర్శించారు. పరుగులు పెట్టించడం మాట ఎలా ఉన్నా నత్తనడక నడుస్తుందని, ఉచితఇసుకలేకపోగా కూటమి నేతల చేతుల్లో ఇసుకబందీ అయిందని, ఖరీదైన సరుకుగా మారిపోయిందని వెంకటేశ్వర్లు విమర్శించారు. కూటమి నేతలు ఇచ్చిన హామీలు అమలు చేయకపోతే గత ప్రభుత్వానికి పట్టిన గతే పడుతుందని హెచ్చరించారు. ఈధర్నాలో ఐఎఫ్టియు రాష్ట్ర కోశాధికారి జి.ఆదినారాయణమూర్తి, రాష్ట్ర సహాయ కార్యదర్శి ఎం.యేసు, రాష్ట్ర నాయకులు ఆర్ రఘువులు, ఏఐకేఎంఎస్ నాయకులు గంటా బాలరాజు, ఐఎఫ్‌టియు నాయకులు గణేశుల శ్రీను, రేపూరు గృహపనివారాల సంఘం నాయకులు గంటా బేతాళుడు, బందారు బాబురావు, సుబ్రహ్మణ్యం, తాతీలు, పోర్ట్ ఏరియా కన్స్ట్రక్షన్ వర్కర్స్ యూనియన్ నాయకులు కొప్పనాతి నరసింహస్వామి, గ్రామపంచాయతీ నాయకులు రాము, ఎన్.ఆదినారాయణ తదితరులు పాల్గొని ప్రసంగించారు.

# స్టేట్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఫిషరీస్ టెక్నాలజీ ప్రిన్సిపాల్‌గా అంజలి



**కాకినాడ, మేజర్‌న్యూస్ :** స్టేట్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఫిషరీస్ టెక్నాలజీ ప్రిన్సిపాల్‌గా అడిషనల్ డైరెక్టర్ ఆఫ్ ఫిషరీస్ క్యాడర్లో ఎస్. అంజలి పదవీ బాధ్యతలు స్వీకరించడమైనది.

ఈ సందర్భంగా అంజలి మాట్లాడుతూ రైతులకు మేలు జరిగే విధంగా ఆక్వా ల్యాబులను నిర్వహించి పిసిఆర్ పరీక్షలు, మేత నాణ్యత పరీక్షలు, నీటి నాణ్యత పరీక్షలు, మైక్రో బయాలజీ పరీక్షలు మొదలైన సేవలు రైతులకు మరింత దగ్గరగా తీసుకుని వెళ్ళటకు అన్ని రకాల చర్యలు తీసుకుంటామని వెల్లడించారు. మొబైల్ ల్యాబ్ సేవలు రైతుల చెరువులు వద్దకు అందించడం జరుగుతుందని చెప్పారు. మన రైతులు ఉత్పత్తి చేసిన రొయ్యలు అంతర్జాతీయ ప్రమాణాలకు అనుగుణంగా ఉండేటట్లు ఎస్ఎంఎస్, జిసిఎంఎస్ ల్యాబ్‌ల ద్వారా పటిష్టమైన చర్యలు తీసుకొనుట జరుగుతుందని, నిషేధించిన యాంటీబయోటెక్స్ లేని రొయ్యల ఉత్పత్తి లక్ష్యంగా పనిచేయుట జరుగుతుందని తెలియజేశారు. ఈ సందర్భంగా ఆక్వారైతులందరూ ప్రభుత్వ ల్యాబ్ సర్వీసులు పూర్తిగా వినియోగించుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో బోటు డ్రైవర్లకు సంబంధించిన శిక్షణా కార్యక్రమం అనగా ఇంజన్ రిపేరు నిర్వహణ, బోటు నడుపుట, నావిగేషన్ సీమాన్ షిప్, వలల తయారీ రిపేరు, సముద్రంలో చేపల వేట మొదలగు అంశాలపై ఒక సంవత్సరం పాటు శిక్షణ కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందని తెలియజేశారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం నిర్దేశించిన 30% జివిఏ లక్ష్యాలు సాధించుటలో క్షేత్రస్థాయి సిబ్బందికి కెపాసిటీ బిల్డింగ్ చేయుట ద్వారా తమ ఇనిస్టిట్యూట్ పాత్ర ఉంటుందని తెలియజేశారు.

# ఎన్నికల హామీలు నెరవేర్చాలి- ముద్రగడ గిరిబాబు



**ఏలేశ్వరం, మేజర న్యూస్ :** ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీలను పూర్తిస్థాయిలో నెరవేర్చాలని వైసిపి కోఆర్డినేటర్ ముద్రగడ గిరిబాబు డిమాండ్ చేశారు. ఏలేశ్వరం మండలం లింగంపర్తి, భద్రవరం గ్రామాల్లో సోమవారం గిరిబాబు పర్యటించారు. ఈ సందర్భంగా లింగంపర్తి గ్రామంలో స్వర్గీయ వైయస్ రాజశేఖర్ రెడ్డి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. భద్రవరం గ్రామంలో వైసిపి నాయకులు, కార్యకర్తలతో సమావేశం అయ్యారు. సమావేశం అనంతరం గిరిబాబు మాట్లాడుతూ ఒక్క తల్లికి వందనం ఇచ్చి సూపర్ సిక్స్ పథకాలన్నీ అమలు చేసినట్లు ప్రచారం చేసుకోవడం సిగ్గుచేటన్నారు.

ఎన్నికల్లో సూపర్ సిక్స్ పథకాల పేరుతో హామీలు ఇచ్చి ఏడాది పాలన పూర్తయిన అమలు చేయకుండా అమలు చేసామని ప్రచారం చేసుకోవడం దారుణమన్నారు. ఈ కార్యక్రమంలో వైసిపి నాయకులు గొల్లపల్లి సురేష్, గుమ్ములూరి రమణ, యిజనగిరి ప్రసాద్, గొల్లపల్లి కాశి, గొంతి రెడ్డి సతీష్, బందీల అంకాలు, చీమల వెంకన్నబాబు తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థి మిత్ర కిట్లు పంపిణీ



**ఆలమూరు, మేజర్ న్యూస్ :** మండలంలోని జొన్నాడ గ్రామంలో ద్వారంపూడి సత్యనారాయణ రెడ్డి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల నందు రాష్ట్ర ప్రభుత్వం ఉచితంగా ఏర్పాటు చేసిన డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణ విద్యార్థిమిత్ర కిట్లను సోమవారం స్కూల్ మేనేజ్మెంట్ కమిటీ చైర్మన్ మెర్ల శ్రీనివాస్ అధ్యక్షతన, ప్రధానోపాధ్యాయులు అనంత శ్రీనివాస్ ఆధ్వర్యంలో గ్రామ పెద్దలు విద్యార్థులకు అందజేశారు. పంపిణీ చేసిన మిత్ర కిట్లను వారు పరిశీలించారు. అందించిన పాఠ్యపుస్తకాలు, నోట్ పుస్తకాలు, బూట్లు, సాక్సులు, డిక్షనరీలు, బ్యాగులు, బెల్టులుసంఖ్యనుఅడిగి తెలుసుకున్నారు. ఉచితంగా అందిస్తున్న ఈ పాఠ్యపుస్తకాలను విద్యార్థులు సద్వినియోగం చేసుకొని చదువులో ఉన్నత శిఖరాలను అధిరోహిస్తూ ఉపాధ్యాయులకు, తల్లిదండ్రులకు మంచి పేరు ప్రఖ్యాతులు తీసుకురావాలని కోరారు. అలాగే రాబోయే కాలంలో పదో తరగతిలో మంచి ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులకు బహుమతులు అందజేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ కట్టా శ్రీనివాస్, ద్వారంపూడి నాగేంద్ర సత్యనారాయణ రెడ్డి (దొరబాబు), తాడి శ్రీనివాస్ రెడ్డి (బట్టి శ్రీను), గొడవర్తి దుర్గాప్రసాద్ (బాబి), తాడి మెహర్ ఆదిత్య రెడ్డి, నల్లిమిల్లి రామారెడ్డి, జనిపల్లి సుబ్రహ్మణ్యం, చింతలపూడి శ్రీనివాస్, చెల్లె ప్రేమ్ కుమార్, మల్లిడి సూర్యనారాయణ రెడ్డి, పోలినాటి కుమార్ బాబు, యాళ్ళ వినోద్ పలువురు ఉపాధ్యాయులు,విద్యార్థులు పాల్గొన్నారు.

# జాబ్ మేళాలో 78 మందికి ఉద్యోగ అవకాశం



- వాసంశెట్టి సత్యం, కంపెనీ ప్రతినిధులుచే నియామక పత్రాలు అందజేత

**రామచంద్రపురం, మేజర్ న్యూస్ :** రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ ఆధ్వర్యంలో సోమవారం రామచంద్రపురంలోని ఉపాధి కార్యాలయంలో సత్యం వాసంశెట్టి ఫౌండేషన్ చైర్మన్ వాసంశెట్టి సత్యం పర్యవేక్షణలో నిర్వహించిన జాబ్ మేళాలో 78 మంది ఎంపిక అయ్యారు. ఇందులో డిక్సన్‌లో 11, టైచే కేప్టింగ్స్ ప్రైవేట్ లిమిటెడ్‌లో 08, మేడ్ ప్లస్‌లో 15, మెట్రో కేం 17, డిమార్ట్ 05, ఎస్‌బిఐ కార్డ్స్‌లో 22 వెరసి మొత్తం 78 మంది ఎంపిక అయ్యారు. ఎంపికైన వారికి సత్యం వాసంశెట్టి ఫౌండేషన్ చైర్మన్ వాసంశెట్టి సత్యం, కంపెనీ ప్రతినిధుల సమక్షంలో సోమవారం ఉపాధి కార్యాలయంలో నియామక పత్రాలు అందించడం జరిగింది. మంత్రి వాసంశెట్టి సుభాష్ ఆధ్వర్యంలో ప్రతివారం రామచంద్రపురంలోని ఉపాధి కార్యాలయంలో పలు కంపెనీలు జాబ్ మేళా నిర్వహిస్తున్న సంగతి తెలిసిందే. నియోజవర్గంలో నిరుద్యోగ సమస్యను రూపుమాపేందుకు రాష్ట్రంలోని పలు కంపెనీలతో ఒప్పందం చేసుకొని దశలవారీగా జాబ్ మేళాలు నిర్వహించి నిరుద్యోగులకు ఉపాధి కల్పిస్తున్నారు. ఉపాధి కల్పన నిరంతర ప్రక్రియగా సాగాలనదే మంత్రి సుభాష్ అభిమతం. కంపెనీ ప్రతినిధులు హర్ష, దుర్గ ప్రసాద్, తేజ, సతీష్ తదితరులు, ఉపాధి ప్రాజెక్ట్ డైరెక్టర్ రామ్ కుమార్, ఉపాధి సిబ్బంది పాల్గొన్నారు. అనంతరం తమకు ఉద్యోగ అవకాశాలు కల్పించిన కంపెనీ హెచ్ఆర్ లకు, ఉపాధి కార్యాలయం, సత్యం వాసంశెట్టి ఫౌండేషన్ కు ఉద్యోగ అవకాశం పొందినవారు కృతజ్ఞతలు తెలియజేశారు. అనంతరం మంగళవారం మంత్రి సుభాష్ పుట్టినరోజును పురస్కరించుకుని ఉద్యోగ భవన్‌లో కేకు కోసి ముందస్తు వేడుకలు నిర్వహించారు.

# ప్రభుత్వ నిబంధన పాటించని ప్రైవేట్, కార్పొరేట్ విద్యా సంస్థలపై చర్యలు తీసుకోవాలి



**కాకినాడ, మేజర్ న్యూస్** : భారత విద్యార్థి ఫెడరేషన్ (ఎస్.ఎఫ్.ఐ.) కాకినాడ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో ప్రభుత్వ నిబంధనల పాటించనీ ప్రైవేట్, కార్పొరేట్ విద్యా సంస్థలపై చర్యలు తీసుకోవాలని కోరుతూ జిల్లా కలెక్టరేట్ లో ప్రజా ఫిర్యాదుల పరిష్కారం వేదిక లో జిల్లా కలెక్టర్ షగిలి.సన్మోహన్‌కి ఎస్ఎఫ్ఐ కాకినాడ బృందం వినతి పత్రం ఇవ్వడం జరిగింది. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్ష, కార్యదర్శి జి.శ్రీకాంత్, ఎమ్.గంగాసూరిబాబు సంయుక్తంగా మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా జూన్ 12వ తేదీ నుండి ప్రభుత్వ ప్రైవేటు విద్యాసంస్థలు ప్రారంభమయ్యాయి. కాకినాడ జిల్లా వ్యాప్తంగా ఉన్నటువంటి ప్రైవేట్ కార్పొరేట్ విద్యా సంస్థలు ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తున్నాయి. ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా పాఠశాలలో పాఠ్యపుస్తకాలు స్టేషనరీ అమ్మకాలు నిర్వహించకూడదని విద్యా హక్కు చట్టం చెబుతున్న ప్రైవేట్ కార్పొరేట్ సంస్థలు ఇవేమీ పట్టించుకోకుండా అధిక మొత్తంలో పాఠ్య పుస్తకాలు,స్టేషనరీ అమ్ముతున్నారని వాటిపైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అనుమతులు లేకుండా పాఠశాల విద్యార్థులను పాఠశాలలో చేర్పిస్తూ విద్యార్థుల భవిష్యత్తును అగామగోచలం చేస్తున్న ప్రైవేట్ పాఠశాలలను తక్షణమే మూసివేయాలని డిమాండ్ చేశారు. అధిక మొత్తంలో ఫీజులు వసూలు చేస్తున్న పాఠశాలలపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అనుమతులు లేకుండా పాఠశాలలో హాస్టల్లో నిర్వహిస్తు విద్యార్థులను వేధిస్తున్న పాఠశాలపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ప్రైవేట్ కార్పొరేట్ పాఠశాలలో విద్యాహక్కు చట్ట ప్రకారం పేద మధ్యతరగతి విద్యార్థులు కేటాయించిన 25 శాతం సీటును అమలు చేయడం కోసం ప్రభుత్వం కృషి చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా గర్ల్స్ కన్వీనర్ జి.చిన్ని తదితరులు పాల్గొన్నారు.

# శ్రీ మరిడమ్మ జాతర ఏర్పాట్లు పగడ్బందీగా నిర్వహించాలి- ఆర్డీఓ శ్రీరమణ



**పెద్దాపురం,మేజర్‌న్యూస్** : పెద్దాపురం పట్టణంలో వేంచేసియున్న శ్రీశ్రీ మరిడమ్మ అమ్మవారి జాతర మహోత్సవాలు ఈ నెల 24వ తేది నుండి 31-7-2025 వరకు నిర్వహించు జాతర మహోత్సవాలలో సంబంధిత శాఖాధికారులు ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పగడ్బందీగా నిర్వహించాలని ఆర్డీఓ కె.శ్రీరమణి తెలిపారు. సోమవారం మరిడమ్మ అమ్మవారి దేవస్థానం నందు ఆర్డీఓ శ్రీరమణి అధ్యక్షతన జాతర ఏర్పాట్లుపై వివిధ శాఖల అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె పోలీస్, మున్సిపాల్టీ, ఆర్ & బి, మెడికల్ హెల్త్, ఎలక్ట్రికల్, ఫైర్, ఆర్టీసి ఇతర శాఖాధికారులు తమ శాఖల పరిధిలో దేవస్థాన జాతర ఏర్పాట్లుపై సమీక్షించారు. ఈ కార్యక్రమంలో దేవస్థాన అసిస్టెంట్ కమీషనర్ కె.విజయలక్ష్మీ, దేవస్థాన సిబ్బంది, ఆసాదులు, వేద పండితులు, ఆయా శాఖల అధికారులు పాల్గొన్నారు. దీనికి ముందుగా ఆర్డీఓ శ్రీరమణి శ్రీశ్రీ మరిడమ్మ అమ్మవారిని దర్శించుకున్నారు. వీరికి దేవస్థాన అసిస్టెంట్ కమీషనర్ కె.విజయలక్ష్మీ వేదపండితుల ఆధ్వర్యంలో స్వాగతం పలికి అమ్మవారి దర్శనం కల్పించి, వేదపండితులచే వేద ఆశీర్వచనాలు అందజేశారు.

# గ్రామీణ ప్రాంతాల అభివృద్ధే లక్ష్యంగా ప్రభుత్వం





**- ఎమ్మెల్యే బండారు**

**ఆత్రేయపురం, మేజర్ న్యూస్** : రాష్ట్ర ప్రభుత్వం గ్రామీణ ప్రాంతాల అభివృద్ధి లక్ష్యంగా పనిచేస్తుందని కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు అన్నారు. సోమవారం ఆత్రేయపురంలో రూ.20.65 లక్షల వ్యయంతో నిర్మించ తలపెట్టిన సీసీ రహదారుల నిర్మాణానికి, రజకపేటలో 40 వేల లీటర్ల కెపాసిటీతో, రూ.77లక్షల అంచనా విలువతో నిర్మించనున్న వాటర్ ట్యాంక్ నిర్మాణానికి బండారు కాలనీలో 60వేల లీటర్ల కెపాసిటీతో, రూ.84 లక్షల వ్యయంతో నిర్మించనున్న వాటర్ ట్యాంక్‌కు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల్లో ఇచ్చిన హామీలను విడతల వారీగా అమలు చేస్తూ రాష్ట్రాన్ని ప్రజా సంక్షేమం వైపు నడుపుతూ ఎన్నో సంక్షేమ కార్యక్రమాలు అమలు చేస్తూ ముందుకు వెళ్తున్నామని, ఇచ్చిన మాటకు కట్టుబడి విద్యా సంవత్సరం ప్రారంభం రోజునే విద్యార్థుల తల్లుల ఖాతాలో అమ్మ ఒడి డబ్బులు జమ చేయడం కూటమి ప్రభుత్వం చిత్తశుద్ధికి నిదర్శనమని, ప్రతిపక్షాలు ఎన్ని రాద్ధాంతాలు చేసిన ఇచ్చిన ప్రతి హామీ నిలబెట్టుకుంటామని, ప్రజా సంక్షేమంలో సరికొత్త చరిత్ర సృష్టిస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు ముదునూరి వెంకటరాజు, రామ్ బద్దిరాజు, కరుటూరి నరసింహారావు, కూసంపూడి రామకృష్ణంరాజు, మద్దూరి సుబ్బారావు, గెద్దం సుధా, జుజవరపు హరిబాబు, ఎంపీడీవో వెంకట్ రామన్, కూటమి నాయకులు ఉన్నారు.

# గ్రామ సచివాలయ ఉద్యోగులను సొంత మండలాల్లోనే నియమించండి



**ఆలమూరు, మేజర్ న్యూస్** : ప్రజలకు ప్రభుత్వ పథకాలను చేరవేసి గ్రామ సచివాలయ ఉద్యోగులను తమ సొంత మండలాల్లోనే నియమించాలని నియోజకవర్గం గ్రామ సచివాలయ ఉద్యోగుల సంఘం నాయకులు కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానంద రావుకు వినతి పత్రాన్ని సమర్పించారు. సచివాలయ ఉద్యోగుల సమస్యలను ఎమ్మెల్యే బండారు ద్వారా ప్రభుత్వానికి వివరించాలంటూ సచివాలయం ఉద్యోగులు అభ్యర్థించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సొంత మండలాల్లోని ఉద్యోగ బాధ్యతలు నిర్వహించడం వలన చాలీచాలని జీతాలతో గత ఆరేళ్లుగా నెట్టుకొస్తున్నామని, ఎన్డీఏ కూటమి ప్రభుత్వం జీవో నెంబర్ 5ను విడుదల చేస్తూ సొంత మండలాల వారు అదే మండలంలో ఉద్యోగ బాధ్యతలు నిర్వహించరాదని పేర్కొనడం మూలిగే నక్కపై తాటి పండు పడినట్లేనని అన్నారు. అతి తక్కువ జీతంతో బాధ్యతలు నిర్వహిస్తున్న మాకు వేరే మండలాల్లో ఉద్యోగ బాధ్యతలు నిర్వహిస్తే కుటుంబ ఖర్చుల కొరకు అప్పులు చేయవలసి వస్తుందని వాపోయారు. సొంత మండలాల్లో ఉద్యోగ బాధ్యతలు నిర్వహిస్తే సకాలంలో ప్రభుత్వ పథకాలను ప్రజలకు చేరవేసే అవకాశం ఉంటుందని పేర్కొన్నారు. పిచ్చుకపై బ్రహ్మాస్త్రం వేయకుండా మాలాంటి చిరుద్యోగులను ప్రభుత్వం వారు కనికరించి సొంత మండలాల్లోనే ఉద్యోగ బాధ్యతలు నిర్వహించేలా ప్రభుత్వ పెద్దలు చర్యలు చేపట్టాలని వీరు కోరారు. ఈ కార్యక్రమంలో కొత్తపేట నియోజకవర్గం సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

# మండపేట పట్టణ తెదేపా సంస్థాగత ఎన్నికల అబ్జర్వర్‌గా వంటిపల్లి సతీష్




**మండపేట, మేజర్ న్యూస్** : మండపేట పట్టణ తెలుగుదేశం పార్టీ సంస్థాగత ఎన్నికల అబ్జర్వర్‌గా ఆలమూరుకు చెందిన ప్రముఖ తెలుగుదేశం నాయకుడు, సొసైటీ మాజీ చైర్మన్ వంటిపల్లి సతీష్ నియమితులయ్యారు. మండపేట ఎమ్మెల్యే వేగుళ్ళ జోగేశ్వరరావు ఆదేశాల మేరకు అబ్జర్వర్‌గా సోమవారం ఆయన బాధ్యతలు స్వీకరించారు. వంటిపల్లి సతీష్ కు పలువురు నాయకులు, కార్యకర్తలు అభినందనలు తెలియజేశారు.

# అతిసార వ్యాధి నిర్మూలనపై గోడపత్రిక ఆవిష్కరణ




**పిఠాపురం, మేజర్ న్యూస్** : పిఠాపురం పాడా కార్యాలయంలో జిల్లా ఇమ్యునైజేషన్ ఆఫీసర్ (డిఐఒ) డాక్టర్ కేవీ సుబ్బారావు అతిసారా వ్యాధి నిర్మూలనపై గోడపత్రికలను ఆవిష్కరించారు. అతిసార ఎలా ప్రబలుతుంది? వ్యాధి నివారణ అంటే ఏమిటి ? ఏఏ సీజన్లో ఇది సోకుతుంది అని వివరించారు. రెండు నెలలపాటు వ్యాధి గురించి అవగాహన కల్పిస్తున్నట్లు తెలిపారు. ఐదేళ్ల లోపు చిన్నారులకు ఇప్పటికే ఓఆర్ఎస్ ద్రావణ ప్యాకెట్లు అందజేసినట్లు వివరించారు. పిఠాపురం నియోజకవర్గంలో 21,321 మంది చిన్నారులు ఉన్నారని వారందరికీ ఏడిపిల పరిధిలో ఓఆర్ఎస్ ప్యాకెట్లు జింక్ టాబ్లెట్లు అందజేసినట్లు చెప్పారు జూలై 31 వరకు అవగాహన సదస్సులు నిర్వహిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో మల్లం పి. హెచ్ సూపర్వైజర్ వీరభద్రరావు తదితరులు పాల్గొన్నారు.

# కాకినాడ పరిధిలోని జిల్లా అధికారులకు యోగా శిక్షణా కార్యక్రమం





**కాకినాడ, మేజర్ న్యూస్ :** యోగాంధ్ర కార్యక్రమాల్లో భాగంగా సోమవారం ఉదయం స్థానిక జిఆర్‌టి గ్రాండ్ హొటల్‌లో ఆయుష్ శాఖ, జిఆర్‌టి గ్రాండ్ హొటల్ సంయుక్త ఆధ్వర్యంలో కాకినాడ పరిధిలోని జిల్లా అధికారులకు యోగా శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జిల్లా రెవెన్యూ అధికారి జె.వెంకటరావు హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి యోగా తరగతులను ప్రారంభించారు. హాజరైన శిక్షణార్ధులకు జిల్లా రెవెన్యూ అధికారి అభినందనలు తెలియజేసారు. ఈ సందర్భంగా జిల్లా రెవెన్యూ అధికారి జె.వెంకటరావు మాట్లాడుతూ యోగాంధ్ర 2025 కార్యక్రమం జూన్ 21 వ తేదీన ఉన్నందున మే 21 వ తేదీ నుండి జూన్ 21 వ తేదీ వరకు రాష్ట్ర స్థాయిలో, జిల్లా స్థాయిలో వివిధ కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుందని ఆయన తెలిపారు. ప్రతిఒక్కరూ కనీసం ఈ నెల రోజులైనా యోగాభ్యాసాన్ని నిత్యం కొనసాగించడం ద్వారా ఆరోగ్య ప్రయోజనాలను పొందాలని కొరారు. అనంతరం యోగాచార్య చిట్టిబాబు ఆహూతులకు వివిధ యోగాసనాలు, ప్రాణాయామ ప్రక్రియల శిక్షణ నిర్వహించి, వాటి సాధన వల్ల కలిగే ఆరోగ్యం ప్రయోజనాలను వివరించారు. అలాగే బ్రహ్మకుమారి సంస్థ ప్రతినిధులు ధ్యానం, రాజయోగం అంశాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఆయుష్ వైద్యులు డా. మహ్మద్ షాహిద్ అలీ, జిఆర్‌టి గ్రాండ్ హొటల్ జిఎం శివ కృష్ణ, సేల్స్ మేనేజర్ అనిత, జిల్లా అధికారులు, యోగ గురువులు తదితరులు పాల్గొన్నారు.

# శ్రీ మరిడమ్మ అమ్మవారి జాతర ఉత్సవాలు పూర్తిస్థాయిలో జరిగేలా చర్యలు తీసుకోవాలి

### – జనసేన పట్టణాధ్యక్షులు పొలమరశెట్టి సత్తిబాబు



**పెద్దాపురం,రూరల్, మేజర్‌న్యూస్ :** పెద్దాపురం పట్టణంలో వేంచేసియున్న శ్రీశ్రీ మరిడమ్మ అమ్మవారు జాతర ఏర్పాట్లుపై ఆర్డీఓ కె.శ్రీరమణి అధ్యక్షతన జరిగిన సమావేశంలో సోమవారం జనసేన పట్టణాధ్యక్షులు పొలమరశెట్టి సత్తిబాబు పాల్గొని మాట్లాడుతూ శ్రీ మరిడమ్మ అమ్మవారు భక్తజన కోటి కల్పవల్లిగా ప్రసిద్ధిగాంచిన తల్లి అని అమ్మవారి జాతర ఉత్సవాలపై ఆంక్షలు తగదని, భారతీయ సాంస్కృతి సాంప్రదాయాల ప్రకారం సాయంత్రం నుండి మరుసటి రోజు తెల్లవారుజాము వరకుఅమ్మవారిఉత్సవాలుగతంలో నిర్వహించడం ఆచారంగా వస్తుందని, కాని అధికారులు ఆంక్షలు పెట్టి రాత్రి 9 నుండి 12 గంటల వరకు మాత్రమే నిర్వహించడం జరుగుతుందని, కావున ఉన్నతాధికారులు, సంబంధిత శాఖాధికారులు ఉత్సవాలను పూర్తిస్థాయిలో తెల్లవారుజాము వరకు జరిగేలా చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు.

# విద్యుత్ సరఫరా అంతరాయం



**పెరవలి, మేజర్ న్యూస్ :** తూర్పుగోదావరి జిల్లా పెరవలి మండలం మల్లేశ్వరం సబ్ స్టేషన్ పరిధిలో జూన్ 17వ తేదీ మంగళవారం నుండి జూన్ 19వ తేదీ గురువారం వరకు ఉదయం 09:00 గంటల నుండి సాయంత్రం 05:00 గంటల వరకు 33 కెవి / 11 కెవి విద్యుత్ సబ్ స్టేషన్ పరిధిలో గల 11 కెవి ఫీడర్ నందు కల మల్లేశ్వరం, కడింపాడు గ్రామములకు ఆర్డిఎస్ఎస్ పనుల నిమిత్తం విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగును. కావున గృహ మరియు వాణిజ్య వినియోగదారులు గమనించి సహకరించవలసినదిగా ఎం.నారాయణ అప్పారావు, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, ఆపరేషన్స్ ఏపీ ఈపీడీసీఎల్ వారు కోరారు.

# పిఠాపురం పిజిఆర్ఎస్ కు 61 అర్జీలు



**పిఠాపురం, మేజర్ న్యూస్ :** పిఠాపురంలో నిర్వహించిన పిజిఆర్ఎస్ కార్యక్రమానికి 61 అర్జీలు వచ్చినట్టు పిఠాపురం ఏరియా డవలప్మెంట్ అథారిటీ (పాడా) కార్యాలయంలో సోమవారం నిర్వహించిన పీజీఆర్ఎస్ కార్యక్రమంలో పాడా పీడీ ఏ.చైత్ర వర్షిణి పాల్గొని, పిఠాపురం పరిసర ప్రాంతాల ప్రజలు నుంచి వివిధ అర్జీలను స్వీకరించారు. ఈ సందర్భంగా పాడా పీడీ ఏ.చైత్ర వర్షిణి మాట్లాడుతూ పీజీఆర్ఎస్ కార్యక్రమంలో వివిధ అంశాలపై 61 అర్జీలు అందాయన్నారు. ఇందులో రెవెన్యూ -24, మునిసిపాలిటీ-16, పిఆర్ - 6, ఇతరములు -15 వచ్చాయని ఆమె తెలిపారు. ఈ అర్జీలను క్షుణ్ణంగా పరిశీలించి పరిష్కారానికి కృషి చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో పిఠాపురం కమిషనర్ కనకారావు, ఏపీడీ వసంత మాధవి తదితరులు పాల్గొన్నారు.

# టిడిపి మండలాధ్యక్షులుగా మొయిళ్ళ కృష్ణమూర్తి



**పెద్దాపురం,మేజర్‌న్యూస్ :** పెద్దాపురం మండల టిడిపి అధ్యక్షులుగా సీనియర్ టిడిపి నాయకులు మరియు తిరుపతి గ్రామ సర్పంచ్ మొయిళ్ళ కృష్ణమూర్తి ఎన్నికయ్యారు. సోమవారం పెద్దాపురంలోజరిగిన టిడిపి మండల సమావేశంలో మండలాధ్యక్షులుగా మొయిళ్ళ కృష్ణమూర్తి, కార్యదర్శిగా గుత్తుల సూర్యావతి, 12 మందితో మండల కమిటి ఎంపికయింది. ఈ సందర్భంగా నూతన కమిటి సభ్యులకు టిడిపి నేతలు, నాయకులు అభినందనలు తెలిపారు.

# జిల్లా పరిషత్ పాఠశాలలో విద్యార్థులకు ఎస్ఆర్‌కెవిఎం కిట్లు పంపిణీ



**రాజవొమ్మంగి, మేజర్‌న్యూస్ :** రాజవొమ్మంగి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పాఠశాల విద్యార్థిని విద్యార్థులకు ఎస్ఆర్‌కె విద్యార్థిమిత్ర కిట్లను ప్రజా ప్రతినిధులు అందజేశారు. పాఠ్యపుస్తకములు, నోటు పుస్తకాలు, సర్వేపల్లి రాధాకృష్ణ విద్యార్థిమిత్ర కిట్లను జడ్పిటిసివడుగుల జ్యోతి, మండల టిడిపి అధ్యక్షులు గొల్లపూడి పెద్దిరాజు, స్కూల్ మేనేజ్మెంట్ కమిటీ చైర్మన్ మరిచర్ల శ్రీనివాసరావు,వైస్ చైర్మన్ మిరియాల వెంకటరమణ, మండల విద్యాశాఖ అధికారి-2 టి.సూరారెడ్డి అందజేశారు. విద్యార్థులు ఈఅవకాశాన్నిచక్కగా వినియోగించుకొని మంచి భవిష్యత్తుకు పునాదులు వేసుకోవాలని జడ్పిటిసి జ్యోతి, గొల్లపూడి పెద్దిరాజు, సూరయ్య రెడ్డి అన్నారు. పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు ఆదిలక్ష్మి ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో ముప్పన సావిత్రి, అంకం రవి, పెదిరెడ్ల సత్తిబాబు, కమిటీసభ్యులు మహమ్మద్‌అలీ,పాపాని వీరభద్రరావు పాఠ్యపుస్తకాలను విద్యార్థులకు పంపిణీ చేశారు.

# అంగన్వాడి కార్మికులకు సంక్షేమ పథకాలు అమలు చేయాలి



### – తల్లికి వందనం అమలు చేయాలి

**చింతూరు, మేజర్ న్యూస్:** అంగన్వాడి వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ సిఐటియు అనుబంధ సంఘం రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు చింతూరు ఐటీడిఏ ముందు నిరసన కార్యక్రమం సోమవారం చేపట్టారు. ఈ సందర్భంగా సిఐటియు మండల ప్రధాన కార్యదర్శి పొడియం లక్ష్మణ్ మాట్లాడుతూ అంగన్వాడి కార్మికులకు అందరికీ కూడా ప్రభుత్వ సంక్షేమ పథకాలు అమలు చేయాలి అని అన్నారు. సమాన పనికి సమాన వేతనం అమలు చేయాలి ఇదే ముఖ్యమంత్రి ప్రతిపక్షంలో ఉన్నప్పుడు ఎన్నికల ప్రచార సభలో మాత్రం అంగన్వాడి కార్మికులందరికీ కూడా ఆదుకుంటాను న్యాయం చేస్తానని ఆరోజు అన్నమాట ఈరోజు సంక్షేమ పథకాలు అమలు చేసేదాంట్లో అంగన్వాడి కార్మికులకి చిన్నచూపు చూస్తున్న కూటమి ప్రభుత్వం చాలా దుర్మార్గంగా వ్యవహరిస్తుంది అన్నారు. రాష్ట్రవ్యాప్తంగా ఉన్నటువంటి అంగన్వాడి కార్మికులందరికీ కూడా తల్లికి వందనం ఇవ్వాలని అన్నారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు కార్మికుల మీద లేబర్ కోడ్ తీసుకువచ్చింది అని, ఆ లేబర్ కోడ్‌లను రద్దు చేయాలి అని అన్నారు. అంగన్వాడి కార్మికులకి ఎఫ్ఆర్ఎస్ యాప్ తీసుకొచ్చి నాన్న అవస్థలు పెడుతురన్నారు. ఆ యాప్‌ని వెంటనే రద్దు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అనంతరం సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని ఐటిడిఏ ఏపీవో కి అందజేశారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ మండల కమిటీ సభ్యులు కారం. సుబ్బారావు, అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షులు ముసుగు రాజేశ్వరి, సోడి కనక, బొగ్గ లలిత, భద్రమ్మ, విజయ, రాములమ్మ తదితరులు పాల్గొన్నారు.

# గిరిజన గ్రామాలకు మౌలిక సదుపాయాలు



**రంపచోడవరం,మేజర్‌న్యూస్ :** ఏజెన్సీ ప్రాంతాల్లోని గిరిజన మారుమూల గ్రామాలకు మౌలిక సదుపాయాలు కల్పనకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ధర్తీ అభజన జాతీయ గ్రామ ఉత్కర్ష అభియాన్ ద్వారా గిరిజనులకు అవగాహన కల్పించడం జరుగుతుందని రంపచోడవరం ఐటీడీఏ ప్రాజెక్ట్ అధికారి కట్టా సింహాచలం పేర్కొన్నారు. సోమవారం గంగవరం మండలం కుసుమరాయి గ్రామంలో డిఏ జుగా పథకం సమావేశంలో రంపచోడవరం ఐటీడీఏ ప్రాజెక్ట్ అధికారి కట్టా సింహాచలం మాట్లాడుతూ ధర్తీ అభ జన జాతీయ గ్రామ ఉత్కర్ష అభియాన్ (డిఏ జూగా) పథకం అమలు చేయడానికి ఏజెన్సీ ప్రాంతంలో 211 గ్రామాలు ముందుగా గుర్తించడం జరిగిందని, అదేవిధంగా అడ్డతీగల మండలంలో 7 గ్రామాలు, దేవిపట్నం మండలంలో 11 గ్రామాలు, గంగవరం మండలంలో 47 గ్రామాలు, మారేడుమిల్లి మండలంలో 40 గ్రామాలు, రాజమ్మంగి మండలంలో 14 గ్రామాలు, రంపచోడవరం మండలంలో 23 గ్రామాలు, వై.రామవరం మండలంలో 67 గ్రామాలు మౌలిక సదుపాయాలు కల్పనకు ముందుగా గుర్తించడం జరిగిందని ఆయన తెలిపారు. అదే విధంగా సబ్ ప్లాన్ ఏరియాలో రౌతులపూడి మండలంలో ఒక గ్రామం, శంఖవరం మండలంలో మూడు గ్రామాలు, ప్రత్తిపాడు మండలంలోని రెండు గ్రామాలు గుర్తించడం జరిగిందని, గుర్తించిన గ్రామాలలో వివిధ శాఖలకు సంబంధించిన అధికారులు, సిబ్బందితో కమిటీలు వేయడం జరిగిందని తెలిపారు. అదేవిధంగా ఈ కమిటీలు గుర్తించిన గ్రామాలలో వివిధ గిరిజన తెగలకు అవగాహన సదస్సులు ద్వారా అవగాహన కల్పించడం జరుగుతుందని ఆయన తెలిపారు. ఈనెల 15వ తేదీ నుండి ఈనెల 30వ తేదీ వరకు డీఏ జూగా ద్వారా అవగాహన సదస్సులలో అర్హులైన లబ్ధిదారులకు ఆధార్ కార్డులు, ఆయుష్మాన్ భారత్ కార్డులు, పీఎం ఆవాస్ యోజన పథకంలో పక్కా గృహాలు, పాఠశాలల నిర్మాణాలు, ఏకలవ్య మోడల్ పాఠశాలల నిర్మాణాలు, వైద్య ఆరోగ్య సేవలు అందించేవిధంగాచర్యలు చేపట్టడం జరుగుతుందన్నారు.

ప్రధానమంత్రి జన్మన్ పథకం కింద ఆర్ధిక చేకూర్పు కల్పించాలని అదేవిధంగా గ్యాస్ కనెక్షన్లు లేని లబ్ధిదారులను గుర్తించి పీఎం ఉజ్వల్ పథకంలో గ్యాస్ కనెక్షన్లు అందించాలన్నారు. ప్రతి కుటుంబానికి బ్యాంక్ అకౌంట్ ప్రారంభించాలన్నారు. డిఏ జూగా అవగాహన సదస్సులు నిర్వహిస్తున్న గ్రామాలలో ఉన్న అంతర రహదారులు, విద్యుత్ సదుపాయాలు, త్రాగునీటి సౌకర్యాలు, పాఠశాలలు ఉన్నది లేనిది తెలుసుకొని మౌలిక సదుపాయాలు కల్పించి గిరిజన గ్రామాలను అభివృద్ధి చేయాలని సూచించారు. నిరుద్యోగ గిరిజన యువతకు నైపుణ్య శిక్షణ అందించాలన్నారు. దర్తి అభ జన జాతీయ గ్రామ ఉత్కర్ష అభియాన్ పథకాన్ని సమర్థవంతంగా అమలు చేయడానికి మండల, గ్రామస్థాయిలో కమిటీలు ఏర్పాటు చేయడం జరిగిందని ఆయన అన్నారు. గ్రామసభలు నిర్వహిస్తున్న గ్రామాలలో ముందు రోజు దండోరా వేయించాలన్నారు. అదేవిధంగా స్థానిక ప్రజాప్రతినిధులను భాగస్వాములను చేయాలన్నారు.వివిధ శాఖల అధికారులు సమన్వయంతో పనిచేసి దర్తి అభజన జాతీయ గ్రామ ఉత్కర్ష అభియాన్ (డిఏ జుగా) ను విజయవంతంగా నిర్వహించి గిరిజన ప్రాంత అభివృద్ధికి కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో లక్ష్మణ్, ఉపాధి హామీ పథకం ఏపీవో ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

# పాడి పశువులకు 50 శాతం సబ్సిడీపై పశు దాణా పంపిణీ

**రావులపాలెం,మేజర్‌న్యూస్ :** రాష్ట్రంలోని పాడి రైతులకు 50 శాతం సబ్సిడీపై పశు వులకు దాణాలు అందించినట్లు రావులపాలెం పశువైద్య సహాయ సంచాలకులు (వెటర్నరీ ఎ.డి.) ఎస్.ఉమామహేశ్వర రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి పాడి పరిశ్రమను అభివృద్ధి చేసేందుకు అనేక సంక్షేమ కార్యక్రమాలు చేపట్టారని అందులో భాగంగా చిన్న, సన్నకారు రైతులకు పశువులు పెంచడానికి



అవసరమైన దాణాలు రాయితీపై అందించనునట్లు తెలిపారు 50 కేజీల బస్తా ప్రభుత్వం వారు నిర్దేశించిన రేటు రూ.1100లు ఉండగా 50 శాతం సబ్సిడీపై 550 రూపాయలకే అందించనునట్లు ఆయన తెలిపారు. అందుచేత రావులపాలెం, ఆత్రేయపురం మండలాల్లో తెల్ల రేషన్ కార్డు కలిగిన పసువు పెంపకం దారులు సమీప పశువైద్యశాలలో గాని, రైతు భరోసా కేంద్రంలో గాని తమ పేర్లను నమోదు చేసుకోవాలని ఆయన తెలియజేశారు.

# గోదావరి నదిలో స్నానాలు పూర్తిగా నిషేధం





## – పోచమ్మ ఆలయం వద్ద నీటి పంపులు ఏర్పాటు

**రంపచోడవరం,మేజర్‌న్యూస్ :** దేవీపట్నం మండలం పి.గొందూరులో పోచమ్మ అమ్మవారి ఆలయం వద్ద గోదావరిలో నదిలో భక్తులు, పర్యాటకులు స్నానాలు పూర్తిగా నిషేధించినట్లు ఆలయ అధికారులు తెలిపారు. పోచమ్మ అమ్మవారి ఆలయానికి వచ్చే భక్తులు స్నానాలు చేసేందుకు నీటి కుళాయిలు ఏర్పాటు చేశారు. శ్రీ గండి పోశమ్మ అమ్మవారి దేవస్థానం దేవదాయ ధర్మ దాయ శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నారు. అయితే ప్రస్తుతం వర్షాలు ఎక్కువగా కురవడంతో పాటు పోలవరం ప్రాజెక్టు నిర్మాణం వల్ల బ్యాక్ వాటర్ రావడంతో గోదావరి నదిలో నీరు అధికంగా ఉంది. అతి వేగంగా ప్రవహిస్తున్నది. నదిలో ఊబలు, సుడిగుండాలు ఉండడంతో తరచూ పోచమ్మ అమ్మవారి ఆలయం వద్ద ప్రమాదాలు జరుగుతున్నాయి. దీంతో స్నానాల రేవులు మూసివేసారు. పోచమ్మ దేవాలయం వద్ద నీటి కుళాయిలు దగ్గర కేటాయించిన చోట మాత్రమే భక్తులు స్నానాలు చేయాలని ఆలయ అధికారులు కోరుతున్నారు. గోదావరి నది దగ్గరకు వెళ్ళడం అతి ప్రమాదకరమని, ఫోటోలకు, సెల్ఫీలకు, ఇతర పనులకు గోదావరి నది ఒడ్డుకు, గోదావరి నది దరిదాపులకు వెళ్ళరాదని, ఈవిషయంలో ఆలయ సిబ్బందికి సహకరించాలని కార్యనిర్వహణాధికారి విజ్ఞప్తి చేశారు

సరుకులు అధిక ధరలకు విక్రయం :దేవీ పట్నం మండలంలో గండి పోచమ్మ తల్లి ఆలయం వద్ద ఉన్న షాపులలో వస్తువులు భక్తులకు కొంతమంది వ్యాపారులు అధిక ధరలకు విక్రయిస్తున్నారని ఫిర్యాదులు చేస్తున్నారు. కూల్ డ్రింక్స్ బాటిల్ పై 20 రూపాయలు, వాటర్ బాటిల్ పై 10 రూపాయలు అధికంగా వసూలు చేస్తున్నారని సమాచారం. ప్రతీ వస్తువుపై ఎమ్మార్పీ కంటే ఎక్కువగా వసూలు చేస్తున్నారని, వచ్చిన భక్తులు చాలా ఇబ్బందులకు గురి అవుతున్నారు. దీనిపై ఆలయ అధికారులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాల్సిందిగా భక్తులు కోరుతున్నారు.

# అర్థమయ్యే రీతిలో విద్యా బోధన చేయాలి



**రంపచోడవరం,మేజర్‌న్యూస్ :** ఏజెన్సీ ప్రాంతంలోని గిరిజన సంక్షేమ శాఖ ఆశ్రమ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు అర్థమయ్యే రీతిలో విద్యా బోధన చేయాలని రంపచోడవరం ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి కట్టా సింహాచలం ఉపాధ్యాయులను ఆదేశించారు. సోమవారం రంపచోడవరం మండలం నల్లగొండ గ్రామంలోని బాలికల గిరిజన సంక్షేమ శాఖ ఆశ్రమ పాఠశాలను ప్రాజెక్ట్ అధికారి పరిశీలించడం జరిగింది. ముందుగా స్కూలు ఓపెనింగ్ తర్వాత ఎంతమంది విద్యార్థులు పాఠశాలకు జాయిన్ అయింది, అదేవిధంగా ప్రస్తుతం ఎంతమంది విద్యార్థులుఉన్నది,ఎంతమంది ఉపాధ్యాయులు ఉన్నది ప్రాజెక్ట్ అధికారి ఆరా తీశారు. ఈ సందర్భంగా ఐటీడీఏ ప్రాజెక్ట్ అధికారి కట్టా సింహాచలం మాట్లాడుతూ విద్యార్థులందరికీ పుస్తకాలు, నోటు పుస్తకాలు తదితర సామాగ్రి అందింది, లేనిది ప్రాజెక్ట్ అధికారి ఆరా తీశారు. విద్యార్థులకు ప్రతిరోజు ప్రభుత్వ నిబంధనలు ప్రకారం మెనూ అమలు చేయాలన్నారు. విద్యార్థులకు వ్యాధులు రాకుండా ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలన్నారు.

# మహిళల ఆర్థిక పరిపుష్టి కోసం కూటమి ప్రభుత్వం పని చేస్తోంది



**ఏలేశ్వరం, మేజర్‌న్యూస్ :** మహిళల ఆర్థికపరపుష్టు కోసం కూటమి ప్రభుత్వం పని చేస్తుందని ప్రతిపాడు శాసనసభ్యురాలు సత్యప్రభ అన్నారు. సోమవారం ప్రత్తిపాడు మండలం పెదశంకర్లపూడి టిడిపి కార్యాలయంలో మెప్మా కమ్యూనిటీ రిసోర్స్ పర్సన్స్‌కి ఉచిత సాంసంగ్ ట్యాబులు శాసన సభ్యురాలు వరపుల సత్యప్రభ రాజా అందించారు. పట్టణ ప్రాంతాల్లో పేదరిక నిర్మూలన కోసం సేవలందించే మెప్మా సభ్యులకు ఈటాబ్స్ఎంతో ఉపయోగపడతా యని ఎమ్మెల్యే వివరించారు. ఆర్థిక, సాంకేతిక, సామాజిక అభివృద్ధి సేవలను ఇకపై రిసోర్స్ పర్సన్స్ టాబ్‌లను వినియోగించుకుని ఆన్లైన్ ద్వారా సులభతరంగా వారి విధులను నిర్వర్తించవచ్చున్నారు.

ఈ కార్యక్రమంలో పాల్గొన్నఏలేశ్వరం మున్సిపల్ కమిషనర్ ఎం.సత్యనారాయణ మాట్లాడుతూ స్వయం సహాయక సంఘాల నిర్మాణం, ఎస్.ఎల్.ఎఫ్. గ్రూపుల నిర్మాణం,ఆధార్ సీడింగ్, బ్యాంకు లింకేజ్, స్త్రీ నిధి, వడ్డీ లేని రుణాలు వంటి వాటి నిర్వహణ కు ఈ ట్యాబులు ఉపయోగపడతాయన్నారు. కార్యక్రమంలో 26 రిసోర్స్ పర్సన్స్‌కి ఎమ్మెల్యే సత్యప్రభ చేతుల మీదుగా ఈ టాబ్స్ అందించడం జరిగింది.

# ప్రజా సమస్యల పరిష్కార వేదికకు 6 అర్జీలు



**పెద్దాపురం రూరల్, మేజర్‌న్యూస్ :** సోమవారం పెద్దాపురం ఆర్డీఓ కార్యాలయంలో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పిజిఆర్ఎస్) కార్యక్రమానికి 6 అర్జీలు వచ్చినట్లు ఆర్డీఓ కె.శ్రీరమణి తెలిపారు. ఈ అర్జీలను త్వరితగతిన పరిష్కరించాలని ఆర్డీఓ సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో హౌసింగ్ ఏఇ రవిశంకర్,డివిజన్‌లోని వివిధ శాఖల డివిజన్ స్థాయి అధికారులు, అర్జీదారులు తదితరులు పాల్గొన్నారు.

# ఎన్ఎస్ఎస్ ఆఫీసర్ తేజేశ్వరరావుకు ఉత్తమ బ్లడ్ మోటివేటర్ అవార్డు






**– అభినందించిన అకడమిక్ డైరెక్టర్ డాక్టర్ బిఈవిఎల్ నాయుడు**

**కాకినాడ, మేజర్ న్యూస్** : స్థానిక ఆదిత్య డిగ్రీ మరియు పీజీ కళాశాల తెలుగు విభాగ అసిస్టెంట్ ప్రొఫెసర్, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి టి.తేజేశ్వరరావును ఆదిత్య డిగ్రీ మరియు పీజీ కళాశాలల అకడమిక్ డైరెక్టర్ డాక్టర్ బిఈవిఎల్ నాయుడు అభినందించారు. భారతరెడ్ క్రాస్ సొసైటీ ప్రతిష్టాత్మకమైన సేవా అవార్డులను ప్రపంచ రక్తదాతల దినోత్సవం సందర్భంగా శనివారం గుంటూరు నగరంపాలెంలోని భారతీయ విద్యా భవన్‌లో జరిగిన కార్యక్రమంలో అందించారు. సేవ విభాగంలో వివిధ కేటగిరీలలో ఉత్తమ సేవలు అందించిన వారికి పురస్కారాలను ప్రధానం చేశారు. ఈ సందర్భంగా కాకినాడ ఆదిత్య డిగ్రీ మరియు పీజీ కళాశాల ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ అధికారి టి తేజేశ్వరరావుకు కార్యక్రమ ముఖ్య అతిథి, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ మంత్రి సత్య కుమార్ యాదవ్ చేతుల మీదుగా "ఉత్తమ బ్లడ్ మోటివేటర్" అవార్డును అందించారు. ఈ సందర్భంగా ఆదిత్య డిగ్రీ మరియు పీజీ కళాశాలల అకడమిక్ డైరెక్టర్ డాక్టర్ బిఈవిఎల్ నాయుడు తేజేశ్వరరావును అభినందించి మాట్లాడుతూ రక్తదానం చేయడం ఒక ఆరోగ్యకరమైన అలవాటు అని అన్నారు. ఆదిత్య డిగ్రీ కళాశాలలలో ఎన్ఎస్ఎస్ విభాగాల ద్వారా తరచుగా రక్తదాన శిబిరాలు నిర్వహిస్తుంటామని అన్నారు. సేవా కార్యక్రమాల్లో ఆదిత్య విద్యా సంస్థలు ఎప్పుడూ ముందుంటాయని తెలిపారు. తలాసీమియా రోగుల కోసం రక్తదానంపై ప్రజల్లో, విద్యార్థులలో అవగాహన పెంచడంలో క్రియాశీలంగా ఆదిత్య ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారులు వ్యవహరిస్తున్నారని అన్నారు. తేజేశ్వరరావు 22 సార్లు రక్తదానం చేయడమే కాకుండా వేలాది మందిని రక్తదాతలుగా చైతన్యవంతులను చేస్తున్నారని అన్నారు.తేజేశ్వరరావు మాట్లాడుతూ ఉత్తమ సేవా పురస్కారాలకు ఎంపిక చేసిన రెడ్ క్రాస్ సంస్థ ప్రధాన కార్యదర్శి ఎ.కె.పరీదకు, రెడ్ క్రాస్ సంస్థ రాష్ట్ర చైర్మన్ వై.డి.రామారావుకు, వైస్ చైర్మన్ డాక్టర్ నల్లమిల్లి సుగుణ రెడ్డికి, కాకినాడ ఐఆర్‌సిఎస్ వారికి ధన్యవాదాలు తెలిపారు. తలసీమియా రోగుల కోసం రక్తదానం చేయడానికి మరింత మందిని చైతన్య పరుస్తానని అన్నారు. సందర్భంగా పురస్కార గ్రహీత తేజేశ్వరరావును ఆదిత్య విశ్వవిద్యాలయ చాన్సర్, ఆదిత్య విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ నల్లమిల్లి శేషారెడ్డి, ఆదిత్య డిగ్రీ మరియు పీజీ కళాశాలల సెక్రటరీ డాక్టర్ నల్లమిల్లి సుగుణారెడ్డి, డైరెక్టర్ డాక్టర్ నాయుడు, వైస్ ప్రిన్సిపాల్ సి.సత్యనారాయణ, క్యాంపస్ ఇంచార్జ మూర్తి, అధ్యాపకులు అభినందించారు.

# వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలి



**– ఎమ్మెల్యే బండారు సత్యానందరావు**

**ఆత్రేయపురం, మేజర్ న్యూస్** : ప్రతి ఒక్కరూ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని, చిన్నారుల్లో ప్రబలే అతిసార వ్యాధిపై తల్లిదండ్రులు అవగాహన పెంచుకొని వ్యాధి రాకుండా తగిన ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు అన్నారు. సోమవారం ఆత్రేయపురం పిహెచ్సి వైద్యాధికారులు ఆధ్వర్యంలో వాడపల్లి లో జరిగిన అతిసార వ్యాధి అవగాహన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. చిన్నారులకు చేతుల పరిశుభ్రత పట్ల అవగాహన పెంచాలన్నారు. సరైన సమయంలో టీకాలు వేయించాలన్నారు. పరిశుభ్రమైన నీటినే త్రాగించాలన్నారు. అనంతరం చిన్నారులకు విటమిన్ – ఏ డ్రాప్స్‌ను వేసే కార్యక్రమాన్ని ఎమ్మెల్యే తన చేతుల మీదుగా ప్రారంభించారు. కార్యక్రమంలో డిఎంహెచ్ఓ దుర్గారావు దొర, డివిజనల్ వైద్యాధికారి ఎం.సుమలత, వైద్యాధికారులు హైమ శ్రీ సౌమ్య, సాయి కిరణ్, వైద్య సిబ్బంది, స్థానిక కూటమి నాయకులు పాల్గొన్నారు.

# దివ్యాంగురాలికి స్థలం పట్టా అందజేత



**అమలాపురం,మేజర్‌న్యూస్** : స్థానిక గొల్లగూడెంకి చెందిన రాజులపూడి ఆరుద్ర కుమార్తె సాయి లక్ష్మీ చంద్ర గతంలో జరిగిన ఆస్తి తగాదాల మూలంగా స్పైనల్ కార్డ్ (వెన్నెముక) దెబ్బతిని చక్రాల కుర్చీకే పరిమిత అయ్యారని జిల్లా కలెక్టర్ ఆర్.మహేష్ కుమార్ తెలిపారు. సోమవారం దివ్యాంగులుగా మారిన సాయి లక్ష్మీ చంద్ర కు కామనగరువులో 72 గజాల స్థలానికి జిల్లా కలెక్టర్ చేతుల మీదుగా పట్టాను అందించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ గతంలో వాళ్ల బంధువులతో జరిగిన తగాదాలు మూలంగా దివ్యాంగురాలుగా సాయి లక్ష్మి చంద్ర మారిందని, మే 31వ తేదీన కాట్రేనికోన మండలం గ్రామానికి విచ్చేసిన రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుని తొలుతగా సాయి లక్ష్మీ చంద్ర కలవడం జరిగిం దని ఈ సందర్భంగా ముఖ్యమంత్రి ఈ అమ్మాయికి ఉద్యోగం, ఇల్లు మంజూరు చేయాలని ఆదేశించారని ఆ మేరకు సోమవారం ఇంటి స్థలాన్ని అందించడం జరిగిందన్నారు. రెవెన్యూ సిబ్బంది ఇంటి స్థల సరిహద్దులను నిర్ధారించి అప్పగించాలని ఆదేశించారు. త్వరలో ఉద్యోగం కూడా ఇప్పించడం జరుగుతుందని తెలిపారు.

ఈ సందర్భంగా దివ్యాంగురాలు తల్లిఆరుద్రమాట్లాడుతూ ఆస్తి తగాదాల్లో దివ్యంగురాలుగా మారిన తమ కుమార్తె సాయి లక్ష్మి చంద్రకు రాష్ట్ర ముఖ్యమంత్రి ప్రమాణ స్వీకారం చేసిన మూడో రోజునే రూ 5 లక్షలు పరిహారంగా అందించారని తెలిపారు.

చెయ్యేరు పర్యటనలో కలిసిన తమకు ఇల్లు ఉద్యోగం ఇప్పిస్తానని ముఖ్యమంత్రి హామీ ఇచ్చారని ఈ మేరకు జిల్లా కలెక్టర్ ఇంటి స్థలాన్ని ఇవ్వడం జరిగిందన్నారు. ఇంటి స్థలం పంపిణీ కార్యక్రమంలో డిఆర్వో రాజకుమారి, తాహసిల్దార్ అశోక్, విఆర్ఓ లు పాల్గొన్నారు.

## ప్రభుత్వ ప్రోత్సాహకాలను సద్వినియోగపరుచుకోవాలి



**అమలాపురం, మేజర్ న్యూస్** : పాఠశాల విద్యాశాఖ సమగ్ర శిక్ష విభాగాలు సంయుక్తగా అందిస్తున్న సర్వేపల్లి రాధాకృష్ణ విద్యా మిత్ర కిట్లు సద్వినియోగ పరుచుకుని ఉజ్వల భవిష్యత్తుకు బంగారు బాటలు వేసుకుంటూ ప్రభుత్వ ఆశయ సాధన దిశగా ముందుకు సాగాలని జిల్లా కలెక్టర్ ఆర్.మహేష్ కుమార్ విద్యార్థిని విద్యార్థులకు పిలుపునిచ్చారు. సోమవారం స్థానిక పుర పాలక సంఘ 15వ వార్డులోని శ్రీ గోపాలకృష్ణ గోఖలే పురపాలక ఆదర్శ ప్రాథమిక పాఠశాలలో విద్యార్థినీ విద్యార్థులకు సర్వేపల్లి రాధాకృష్ణ విద్యామిత్ర కిట్లను తరగతికి ఐదుగురు చొప్పున 5 తరగతుల విద్యార్థులకు 25 కిట్లను పంపిణీ చేశారు. ఈ కిట్లో స్కూల్ బ్యాగు, మూడు జతల యూనిఫామ్ నోటు పుస్తకాలు పాఠ్య పుస్త కాలు, బూట్లు, రెండు జతల సాక్ లు, బెల్టు, నిఘంటువు తో కూడిన కిట్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం విద్య, పట్ల ప్రత్యేక శ్రద్ధ పెట్టి పలు సంస్కరణలను అమల్లోకి తెచ్చిందని ఆ యొక్క సేవలను సద్విని యోగం చేసుకోవాలని సూచించారు. మనబడి మన భవిష్యత్తు కార్యక్రమంలో భాగంగా పాఠశాల ఆవరణలో చేపట్టిన నిర్మాణ పనుల ను ఆయన సందర్భంగా పరిశీలించారు ఈ కార్యక్రమంలో డీఈవో షేక్ సలీం భాష, సర్వ శిక్ష ఏపిసి జి.మమ్మీ, పాఠశాల ప్రధానోపాధ్యాయులు సాయి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

# మండలంలో 38 మంది ఎస్‌జిటిలు బదిలీ

**– బిఎంఈఓ సత్యనారాయణ దొర**



**రాజవొమ్మంగి, మేజర్‌న్యూస్** : ఈ ఏడాది విద్యా సంవత్సరంలో 38 మంది ఎస్‌జిటి లకు బదిలీ అయినట్లు నలుగురు ఏలేశ్వరం, అడ్డతీగల బదిలీపై వెళ్ళినట్లు మండల విద్యాశాఖ అధికారి సత్యనారాయణ దొర తెలిపారు. విఆర్ పురం, చింతూరు, ఎటపాక, మారేడుమిల్లి, వై.రామవరం మండలాల నుండి 10 మంది ఉపాధ్యాయులు బదిలీ పైఇక్కడికి వచ్చినట్లు ఆయన తెలిపారు. ఏడుగురు ఉపాధ్యాయులకు ప్రత్యామ్నాయం లేక అదే పాఠశాలలో విధులు నిర్వహిస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ–2 సూరయ్య రెడ్డి ఉన్నారు.

# ఇంటింటా వెలుగులు నింపుతూన్న "తల్లికి వందనం"

**– రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి సుంకర పావని**



**కాకినాడ,మేజర్‌న్యూస్** : తల్లికి వందనం పథకంఅమలు చేయడంలో కూటమి ప్రభుత్వం విజయం సాధించిందని తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యనిర్వహ కార్యదర్శి సుంకర పావని అన్నారు. తల్లికి వందనం పథకం అమలుతో రాష్ట్రంలోని ప్రతి తల్లుల మోముల్లో ఆనందం వెల్లివిరిసిందని అన్నారు.

ఒక కుటుంబం నుండి ఎంతమంది పాఠశాలకు వెళ్లిన ఒక్కొక్కరికి 15,000 చొప్పున నేరుగా తల్లుల ఖాతాల్లో డబ్బు జమ అవడంతో సర్వత్రా హర్షం వ్యక్తం అవుతుందని, ప్రతిపక్షాలు విమర్శించడానికి తావులేకుండా వ్యూహాత్మకంగా వ్యవహరించిన యువ నేత నారా లోకేష్‌కు ఆమె అభినందనలు తెలియజేశారు. కొన్ని ఖాతాలలో డబ్బు జమ కాకపోతే తల్లుల ఖాతాలు యాక్టివేషన్‌లో లేనట్లేనని దానిని తిరిగి యాక్టివ్ చేసుకొని పది రోజుల్లో తిరిగి అప్లై చేసినట్లయితే నేరుగా వారి ఖాతాల్లో నగదు జమ అవుతుందన్నారు.